మే - 2026

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | కె.ఇ. రాజేంద్ర | 02 |
| జప్పత్వనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 05 |
| డ్యాన్స్ బేబి డ్యాన్స్ | కె.ఇ. రాజేంద్ర | 07 |
| మీరు బైబిలంతా... | హన్నాకృప డెస్క్ | 08 |
| సృష్టికర్త | హన్నాకృప డెస్క్ | 09 |
| మారుమనస్సు | సాక్ష్యము | 10 |
| తెలివిలేదు, యోచింపరు | హన్నాకృప డెస్క్ | 12 |
| బైబిల్ ప్రాముఖ్యత | హన్నాకృప డెస్క్ | 13 |
| మదర్ తెరీసా | వై. ప్రసాద్‌రావు | 15 |
| తల్లిదండ్రులారా! | కె.ఇ. రాజేంద్ర | 17 |
| దేవుని కటాక్షము | డా॥ సుష్మ, నెల్లూరు | 19 |
| నా కుటుంబము | స్త్రీల కొరకు | 20 |
| దేవుని సమయం | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ పదవినోదం-17 | | 24 |



**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**
B.A.,B.L.,



**చందా వివరాలు :**

**సంవత్సర చందా రూ. 350/-**
పోషక చందా రూ. 1500/-
జీవితచందా రూ. 5000/-



**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప
పోస్ట్‌బాక్స్ నెం.51 , క్లాపేట, 6వలైను
ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా
సెల్ : 9440217726



**బ్యాంకు అకౌంటు వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**
A/c No.: **10957294340**
Bank: SBI Main Branch, Ongole
IFSC Code : SBIN0000890


**HANNA KRUPA**

**Christian Devotional Monthly Magazine**

**సంపుటి : 23** **సంచిక : 05**

**ప్రభువగు యెహోవాయే నాకు బలము**

| సీరియల్ నంబరు | |
|---|---|

సంపాదకీయం....

# నీ భారము యెహోవా మీద మోపు

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు.

నిద్రలేచిన దగ్గర నుండి మళ్ళీ పడుకోబోయే వరకు జీవితం మనకు భారంగానే ఉంటుంది. రోజూ ఏడ్చుకుంటూ తమ బ్రతుకును భారంగా ఈడ్చుకుంటూ అసలు పుట్టకుండా ఉంటే బాగుండు అని తమను తామే తిట్టుకుంటుంటారు. మనుష్యులు శారీరకంగా, మానసికంగా రెండు భారాలు మోస్తుంటారు. శారీరకంగా కష్టపడినప్పుడు అలసిపోయి హాయిగా నిద్రపోవడంతో ఆ భారము తీరుతుంది. ఇలా ప్రతిరోజూ శారీరకంగా పడ్డ కష్టం విశ్రాంతి తీసుకోవడంతో తీరిపోతుంది. కాని హృదయంలో ఉండే మానసికమైన భారము ఏ.సి. రూంలో పడుకున్నా కూడా పోదు. ఎంత డబ్బు ఉన్నా, ఎంత విలాసవంతమైన జీవితం జీవిస్తున్నా సరే అనేక రకాలైన సమస్యలు మనిషికిమానసిక భారాన్ని కలిగిస్తాయి. వారి డబ్బు, హోదా వారికి నెమ్మదిని కలిగించలేవు. అలాంటి భారాన్ని భరించలేని వారు అనేకమంది ఆత్మహత్యలు కూడా చేసుకుంటుంటారు. ఏవి సమకూర్చుకుంటే సుఖంగా సంతోషంగా బ్రతకొచ్చని వారు కష్టపడి సంపాదించుకుంటారో వాటి వలన ఏ మాత్రం తన భారాన్ని తొలగించుకోలేక పోతున్నారు. శారీరకమైన భారాన్ని తొలగించుకున్నంత సుళువుగా మానసికమైన భారాన్ని తొలగించుకోగలమన్న భ్రమలో ఉండి దేవున్ని లెక్క చెయ్యడం లేదు. మానసికమైన భారాన్ని దేవుడు మాత్రమేతీసి వేయగలడు తప్ప మనుష్యులు స్వతహాగా తీసివేసుకోలేరు. మనిషి తాను మోస్తున్న మానసికమైన భారాన్ని తీసివేయడానికి దేవున్ని ఆశ్రయిస్తేనే దేవుడు తీసివేస్తాడు. మనిషికి దేవుడుఇచ్చే ప్రాధాన్యతని మనిషి గుర్తించకుండా తన పూర్తి జీవితాన్ని తానే నడిపించుకోగలననే అపోహతో దేవునికి తన జీవితం మీద ఏ మాత్రం అజమాయిషీ ఇవ్వడంలేదు. తనకు కావలసినవన్నీ సమకూర్చుకునే పనిలో నిమగ్నమైపోయి, తన జీవితాన్ని భారంగా నడిపించుకుంటూ దేవుడు మనిషికి ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్నాడు. దేవునికి ఏమాత్రం విలువ ఇవ్వకుండా తోటి మనుష్యులకు ఎక్కువ విలువ ఇస్తూ ఆ మనుష్యుల ద్వారామెప్పు పొందాలనే తాపత్రయంతో దేవున్ని పట్టించుకోవడం లేదు. ఈ లోకంలో తనకు ఒకస్థాయి సంపాదించుకోడానికి మనిషి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాడు. దేవునికంటే మనుష్యులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం వలన దేవుడు తనకిచ్చిన ప్రాధాన్యతనుతనకు తానుగా తగ్గించుకుంటున్నాడు. ఇతరుల కంటే తాను ఏ మాత్రం తక్కువగా ఉండకూడదు అన్న భావంతో తగ్గింపు గుణమును తృణీకరించి దేవునికి దూరమవుతున్నాడు. దేవుడు మనల్ని ప్రేమిస్తున్నాడు కాబట్టి మనం కష్టపడుతూ భారంగా జీవిస్తుంటే దేవుడు చాలా బాధపడతాడు. అందుకే "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా నా యొద్దకు రండి నేను మీకు విశ్రాంతి కలుగజేస్తాను" అని మత్తయి 11:28లో దేవుడు బతిమాలుతున్నాడు. నీ భారము తొలగించి నీ జీవితానికి విశ్రాంతి కలుగజేస్తాను రండి అని యేసుపిలుస్తున్నాడు. నీ జీవితం నీకు భారముగా ఉన్నట్లయితే దేవుని దగ్గరకు వచ్చి నీభారము ఆయన మీద మోపితే ఆయన నిన్ను ఆదుకొని నీకు విశ్రాంతి దయచేసి నీ మనసుకు నెమ్మదిని, ప్రశాంతతను అనుగ్రహిస్తాడు. అందుకు నీవు సిద్ధమా?

**-కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర, ఎడిటర్**

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**

**A/c No. 10957294340**

# జప్నత్పనేహు



**(యోసేపు జీవిత చరిత్ర)**

- కొడవటికంటి

"ఆసెనతూ" అన్నాడు జప్నత్ప. ఆసెనతు ఉలిక్కిపడి చూసింది.

'నేను మృదువైన వాడిని కానా? దేవునికి భయపడు తున్నాను' అనుకొని, "కొంత సౌమ్యమైన వాతావరణానికి దూరమయ్యాను. ఏది ఏమైనా ఆమెకు, అదే రఫియాకు మనం ఎంతో రుణపడి ఉన్నాము" అన్నాడు. ఆ మాటకు దూరంగా ఉన్న ఫీనెక్స్ మందహాస ముఖము ఇంక కొంచెం విప్పారినట్లు అనిపించింది. అనేక సంవత్సరాలుగా తన భర్తలోని ఈ మధుర భావన చూడాలన్న కోరిక తన భర్త స్వరం రఫియా అన్నప్పుడు తృప్తిగా నిట్టూర్చింది ఆసెనతు.

తన అన్నలు రావటానికి నెల రోజులు గడువు ఉంది కాబట్టి జప్నత్ప వారి విషయం ఆలోచించడం మానివేశాడు. షిమ్యోనుకు బయట ప్రపంచానికి సంబంధం లేకుండా చెరసాలలో ఉన్నా, వసతులు మాత్రం రాజకుమారునికి జరిగినట్లుగా ఏర్పాటు చేయబడ్డాయి. జప్నత్ప ప్రతిరోజు అక్షాపుతో, షిమ్యోను యోగక్షేమాలు విచారిస్తూనే ఉన్నాడు.

ఆ సాయంకాలం అక్షాపు ఇంటిముందు ఆగిన రథం నుండి దిగుతున్న యజమానుని చూసి, పదిసంవత్సరాల అమ్మాయి భయపడి లోపలికి పరుగెత్తబోయింది. అయితే జప్నత్ప చేయి చాపి ఆ అమ్మాయిని పట్టుకొని, ఎత్తుకొని, లోపలికి ప్రవేశించాడు. అక్షాపు తన చేతిలోని కాగితపు చుట్ట ప్రక్కన పేర్చి నెమ్మదిగా లేస్తుంటే, జప్నత్ప లోపలికి వస్తూ అక్షాపు కుమార్తెను క్రిందకి దించాడు.

అక్షాపు నవ్వుతూ, "మీకు ఆడపిల్ల వుంటే, ఆసెనతు చిన్నప్పుడు ఎలా వుండేదో మీరు చూసివుండే వారు" అన్నాడు.

అక్షాపు నిశితమైన మాటలకు జప్నత్ప ఆలోచనలో పడ్డాడు. అక్షాపు దగ్గరకి వచ్చి, భుజం మీద చెయ్యివేసి "నిజంగా ఈ తలంపు నాకెప్పుడూ రాలేదు. ఆడపిల్ల కావా లనే కోరికకి మీ యిల్లు నాంది పలికింది" అన్నాడు నవ్వుతూ.

"మా ఇంటికి వచ్చి ఎంత కాలమయింది?" అడిగాడు అక్షాపు.

"ఇంటి నుండి పారిపోయినప్పుడు" అన్నాడు జప్నత్ప.

అక్షాపుకు మొదట అర్థంకాలేదు. కాని అర్థమైనప్పుడు జప్నత్ప చేయి పట్టుకొని, ఆసనము మీద కూర్చొబెట్టి, "జప్నత్ప మీరు ఏమి మర్చిపోరు" అన్నాడు.

"అలాగైతే జప్నత్ప అనకుండా యోసేపు అను" అన్నాడు. "మా అన్నలు వచ్చే రోజులు దగ్గరకు వచ్చాయి. బెన్యామీనును అదే మా తమ్ముని తీసుకొని వచ్చి, ధాన్యం తీసుకొని వెళ్ళిపోతారు" అని చెప్పాడు యోసేపు.

"అయితే బెన్యామీనును వారితో కనాను వెళ్ళకుండా చెయ్యాలన్నమాట" అన్నాడు అక్షాపు.

"ఔను, బెన్యామీనును నా తండ్రి యొద్ద నుండి దూరం చేసేటప్పుడు నా సహోదరులు ఏవిధంగా ప్రవర్తిస్తారో చూడాలి. వారు నన్ను నా తండ్రి నుండి వేరు చెయ్యటానికి మానవత్వం మరిచిపోయారు. వారు చేసిన పనికి పశ్చాత్తాపం పడుతున్నట్లుగా కనబడుతున్నారు. అయినా బెన్యామీనును ఐగుప్తులో వదలటానికి వారు ఎలా స్పందిస్తారో చూసి, తర్వాత నేను వారికి ఎప్పుడు తెలియపరచు కోవాల్సిందో ఆలోచిస్తాను" అన్నాడు.

"మీ సహోదరులు వచ్చిన తర్వాత ఏమి చెయ్యాలో, అప్పుడు సెలవిస్తారా?" అని అడిగాడు అక్షాపు.

"నేను సెలవిచ్చేది ఏమిలేదు. వారికి ధాన్యం కొలవక ముందే నా ఇంట్లో భోజనం ఏర్పాటు చేయండి. తర్వాత వారు తిరుగు ప్రయాణంలో ఉన్నప్పుడు బెన్యామీనును ఆపండి" అన్నాడు. అక్షాపు ఆలోచిస్తూ తలూపాడు. జప్నత్ప అతని ముఖంలోకి చూస్తూ ఉన్నాడు. తను ఐగుప్తు ఏలిక, అక్షాపు గృహనిర్వాహకుడు.

ఒకప్పుడు అంటే ఇరవై సంవత్సరాల క్రితం పోతీఫరు ఇంట్లో అక్షాపు దేవుని దూతలాగ కనిపించాడు. నిజానికి ఐగుప్తులో మొదట తనకు భాష నేర్పినవాడు, అన్నింటా గురువు, ఆదరించటంలో తండ్రి. చెరసాలలోకి చేర్చింది

కూడా అక్షాపే. ఈరోజు తన అన్నలు ఐగుప్తులో ప్రవేశించిన తర్వాత చెరసాలలాగ ఉన్నచోట తన అన్న షిమ్యోనుని ఆదరిస్తున్నవాడు అతనే. రేపు తన అన్నలు వస్తే వారిని ఆదరించవలసినవాడు కూడా అతనే. తన వివాహ విష యంలో కూడా అక్షాపే సూత్రధారి. ఎవరీ అక్షాపు? దేవుడు పంపిన దూత. సర్వసృష్టిలో దేవుని కార్యములు ఇంకా ఎన్ని విధాలుగా జరుగుతాయో? తను సముద్రం ప్రక్కన ఇసుకలో ఉన్న ఒక రేణువు. అక్షాపు ఒక ఇసుక రేణువు ఎన్నో ఇసుక రేణువులతో ఈ సముద్రానికి చెలియలికట్టను వేసిన దేవుని కార్యములు. ఆయన చేసిన, చేస్తున్న ఉపకారములలో ఏది చిన్నది? ఏది పెద్దది? మహోన్నతుడు చేసిన ఉపకారము లలో ఏ ఒక్కదాన్నైనా ధ్యానిస్తే? నిజమైన కృతజ్ఞతతో మానవుడు ఆయన క్రియలను ధ్యానిస్తే ఈ జీవితం చాలదు. ఇంక దేవుడ్ని ఏమీ అడగాలని అనిపించదు. తన వైపు చూస్తున్నా, ఆ కళ్ళు ఎక్కడో ప్రయాణం చేస్తున్నాయి. ఆ ప్రయాణంలో తను కూడా కలిసే ఉన్నాడు. 'ఇలా యోసే పును ఎన్నిసార్లు గమనించలేదు?' అనుకున్నాడు అక్షాపు.

ఈసారి చాలాకాలం తర్వాత చనువుగా, పూర్వపు చనువుగా, చుట్టూ ఎవరూ లేరు కనుక ప్రేమగా "యోసేపూ!" అన్నాడు. ఇక్కడే ఉన్నాను అన్నట్లుగా ఆప్యాయంగా చూసాడు యోసేపు.

"మళ్ళీ మామూలుగా చెప్పండి" అన్నాడు.

మరలా యోసేపు చిరునవ్వు నవ్వి "పోతీఫరుగారింట్లో మన జీవితం గుర్తుకు వచ్చింది. ఆ... బెన్యామీనుని ఏదో వంక మీద ఐగుప్తులో ఆగేటట్లుగా చేయండి. ఆ సన్నివేశంలో వారి ప్రవర్తన చూసి, తర్వాత నేను ఎప్పుడు యోసేపుగా వాళ్ళకు పరిచయమవ్వాలో నిశ్చయించుకుంటాను" అన్నాడు. మరలా తనలో తను మాట్లాడు కున్నట్లుగా, "చాలాకాలం పడుతుందేమో! ఈ లోపల నా తండ్రిని, లేయా అమ్మని ఇక్కడకి తీసుకుని రావాలి" అంటూ లేచాడు.

ఇప్పుడు అక్షాపుతో ఈ మాటలన్ని మాటలాడిన తర్వాత హాయిగా నిద్రపోయి లేచిన ప్రాణంలాగ తేలిగ్గా ఉంది. అక్షాపు వైపు చూసి "మీ అమ్మాయి పేరు..... హేనా కదా!" అని "హేనా!" అని పిలిచాడు.

హేనా మెల్లగా వచ్చింది. యోసేపు అమ్మాయిని ఎత్తు కుని ముద్దు పెట్టుకుని, తన మెడలోని రత్నహారం అమ్మాయి మెడలో వేసి, క్రిందకు దించి బయటకు బయలుదేరాడు. హేనా తన మెడలో వేసిన దండని, యోసేపుని మార్చి మార్చి చూస్తూ, ఆయనను వెంబడించింది.

తన కూతురు పేరు ఎంత బాగా గుర్తు పెట్టు కున్నాడు. ఎప్పుడో ఎనిమిది సంవత్సరాల క్రితం యోసేపు కుమారుని పుట్టినరోజు పండుగలో అమ్మాయిని చూసాడు. ఈ ఐగుప్తు ఏలిక, తన వాడు. తను తప్పితే, "యోసేపు" అని పిలవగలిగిన వారు ఐగుప్తులో ఎవరూ లేరు అనే భావన అక్షాపు హృదయంలో ఆనందం నింపింది. యోసేపు వెంబడి బయటకు వచ్చాడు. యోసేపు రథంలో ఎక్కి చెయ్యి ఊపుతుంటే, అక్షాపు ఈ లోకంలోకి వచ్చాడు. వేగంగా రెండు అంగలలో దగ్గరకు వచ్చి, "ఇంతకాలం ఈ కథ నడిపించిన దేవుని చిత్తం, ఇకముందు కూడా సుఖాంతమే. మీరు ఈ విషయాలు మరచిపోవాలి" అని కొంచెం దగ్గరగా వచ్చి రథసారధికి అర్థం కాకుండునట్లుగా, "ఆసెనతుకి చెప్పండి, ఈ జప్నత్పను వారి అన్నలు, తమ్ముడు, తండ్రి, ఆమె నుండి దూరం చెయ్యలేరని" అని హీబ్రూ భాషలో చెప్పాడు. జప్నత్ప ముఖం వెలిగింది. **(సశేషం)**


**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపించాలంటే క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

సీరియల్

# నా చిత్తానుసారుడు

43

**(దావీదు జీవిత చరిత్ర)**

**- కొడవటికంటి**

అమావాస్య అయిపోయిన తర్వాత రోజు నాటికి ప్రజలందరు యెరూషలేము చేరారు. యెరూషలేము నుండి కిర్యాత్యారీములోనికి అబీనాదాబు ఇంటి వరకు జనమే. మందసమున్న ఇంటిలోనికి దావీదు, అబ్యాతారు మరికొందరు యాజకులు లేవీయులు వెళ్ళి మందసమును పట్టుకొని బయటకు తీసుకొని వచ్చి కొత్తబండి మీద ఉంచారు. అబీనాదాబు యొక్క పెద్ద కుమారుడు అహ్యో చక్కగా ముస్తాబై చేతిలో కర్రపట్టుకొని బండిముందు ఎద్దుల దగ్గర నిలుచున్నాడు. అబీనాదాబు రెండవ కుమారుడు ఉజ్జా బండి ఎక్కి కూర్చోని పగ్గాలు పట్టుకొనగానే యాజకులు అన్ని రకాల వాయిద్యాలు ఒక్కసారిగా మ్రోగించారు.

ముప్పయివేల మంది సైనికులు ఏడు మైళ్ళ పొడవున నిలుచున్నారు. యాభైమంది సైనికులు చక్కగా దుస్తులు ధరించి వరసల ప్రకారం నడుస్తుంటే పెండ్లికుమారునివలె అలంకరించుకున్న అహ్యో దాని ముందర నడుస్తున్నాడు. అతనికి సైన్యానికి మధ్యలో వెయ్యిమంది యాజకులు లేవీయులు వాయిద్యాలు వాయిస్తూ పాటలు పాడుతున్నారు. బండిలో ఎడ్ల వెనుక కూర్చున్న ఉజ్జా లయబద్ధముగా ఎద్దులను అదిలిస్తున్నాడు. బండి వెనుక దావీదు మరి కొందరు ముఖ్యులు కూడా దాదాపు రెండు వందల మంది యాజకులు, లేవీయులు వాయిద్యాలు వాయిస్తూ వున్నారు.

యెరూషలేము కొండ మొదటికి వచ్చిన తర్వాత కొండమీద దారి ఇంక పదిగజాల దూరం బాటకు ఇరు వైపుల యాజకుల గృహసముదాయాలు.

ధన్‌మన్న శబ్దం అయింది. బండి ఆగింది. అహ్యో పెద్దగా అరిచాడు. వాయిద్యాలు ఆగిపోయాయి. బండిలోని మందసం కొద్దిగా ఒరిగి ఉన్నది. ఉజ్జా బండి ముందున్న కట్టుకోలు జాలీలో పడివున్నాడు. అతని శిరస్సు మందసము వైపు వాలి వున్నది. అతని కళ్ళు మందసమును చూస్తున్నవి. అతని కుడిచెయ్యి మందసము వైపు చాపబడి ఉన్నది.

దావీదు గబగబా ముందుకు నడిచాడు. అహ్యో దావీదు వైపు చూస్తూ “ఎద్దు కాలు జారింది. మందసము ఒరుగుతుంటే చెయ్యి పైకెత్తి ఆపబోయాడు. చెయ్యి మందసాన్ని తాకకముందే పడిపోయాడు” అని ఏడ్చాడు.

దావీదు కాళ్ళ క్రింద నేల కదులుతున్నట్లు అనిపించింది. ఇంతకుముందు తాను చూసిన మందసము ఇది కాదు అని అనిపించింది. ఒక అడుగు వెనక్కి వేసి మందసము వైపే చూస్తున్నాడు. ఎంతసేపు చూస్తున్నాడో అబ్యాతారు దావీదు ప్రక్కగా వచ్చి అయ్యా అని పిలిచాడు.

అబ్యాతారు ముఖం మాడిపోయినట్లుగా వుంది. దావీదు ఆబ్యాతారు వైపు చూచి యాజకులను పిలిచి ఉజ్జాని క్రిందకు దించమని చెప్పండి అని అటుప్రక్క ఓబేదెదోము ప్రక్కనే ఉన్న పెద్ద ప్రహరీ చూపించాడు.

దావీదు అబ్యాతారును పిలిచి మందసమును ఓబేదెదోము ఇంట్లోపెట్టి ఉజ్జాని ఈ బండిలోనే కిర్యత్యారీమునకు తీసుకెళ్ళవలసినదని చెప్పి అబీషై తెచ్చిన గుఱ్ఱం మీద ఎక్కి వెళ్ళిపోయాడు.

ఇంటికి వచ్చిన దావీదు అబీగయీలు ఒడిలో తల పెట్టుకొని పడుకున్నాడు. ఎవరితోను ఏమి మాట్లాడలేదు. ఆ రాత్రి అంతా నిద్రపోలేదు. మంచం మీద కొంచెంసేపు పండుకుంటే మరికొంచెంసేపు లేచి అటు ఇటూ తిరుగుతున్నాడు. తెల్లవారిన తర్వాత నాతాను ప్రవక్త కొరకు కబురు చేసాడు. నాతానును చూడగానే గుండె కొంచెం కుదుటపడినట్లుగా అనిపించింది. సాదరంగా కూర్చున్న తర్వాత...

“ఇలా ఎందుకు జరిగింది?” అన్నాడు దావీదు.

“ప్రభువు నిర్ణయం చేయనందువలననే. మీరు చిన్న విషయానికి పెద్ద విషయానికి ప్రభువును సంప్రదించి ఏ పనైనా చేస్తారు. మరి మందసమును పట్టణములోనికి తెచ్చే విషయం ప్రభువుని సంప్రదించలేదు. మందసమును మోయవలసిప పద్ధతి ఆచరించలేదు. ప్రభువుకు ఘనతను మనం

ఆపాదించలేము. క్రొత్త బండి ఆయన ప్రయాణించటానికి ఏర్పాటు చేయటానికి నీవెవరవు" అన్నాడు నాతాను ప్రవక్త.

"మరి" అన్నాడు దావీదు.

"మందసం విషయంలో ధర్మశాస్త్రంలో ఏమున్నదో మీరు చదివారా? ధ్యానించారా? యాజకుడైన అమ్మినాదాబు గాని అతని కుమారులు కాని తెలుసుకొనక పోవటమే ఈ అనర్థం. మందసము యాజకుల భుజాల మీదగా ప్రయాణం చేయవలెను. కాని రాజుల హృదయాలోచన ప్రకారం కాదు" అన్నాడు నాతాను ప్రవక్త.

నాతాను ప్రవక్త వెళ్ళిపోయిన తరువాత చాలాసేపు ఆలోచనలో పడిపోయాడు. తనను ఇశ్రాయేలీయులనందరిని ఒక తాటి మీదకు తీసికొని రావాలని తన హృదయాంతరాలలో కోరుకొని ఈ మందస కార్యక్రమం ప్రారంభించాడు. యథార్థ హృదయం దేవుని మందసం మీద కాదని ప్రభువుకు తెలియదా? గబగబా తన గదిలోకి వెళ్ళి మోకరించాడు. ప్రభువుని క్షమాపణ అడిగాడు. తన హృదయం నిమ్మళించే వరకు ఆయన సన్నిధిలో అలానే ఉండిపోయాడు. ఉజ్జా మరణ సన్నివేశం హృదయాంతరాలలో నుండి మాసి పోయేంత వరకు ఆగి పోవలసిందే.

అక్కడ ఓబేదెదోము ఇంటిలోనికి మందసమును తీసికోని వస్తున్నప్పుడు ఇంట్లో వారందరు గడగడ వణికి పోయారు. మందసం ఉన్న గదివైపు తొంగి చూడటానికి కూడా ఎవరికి ధైర్యం లేకుండినది. మందసము ఇంట్లో చేరిన మరునాటి నుండి చాలాకాలంగా అస్వస్థతతో బాధపడుతున్న ఓబేదెదోము తండ్రికి పూర్తి స్వస్థత కలిగింది. అందరూ ఆశ్చర్యపోయారు. ఓబేదెదోము కుమార్తెకు వివాహం జరిగింది. ఏ పశువు ఈనిననూ కవలలనే చివరికి ఓబేదెదోము కోడలు కూడా కవల పిల్లలనే ప్రసవించింది. మందసము ఇంటికొచ్చిన రెండు నెలల్లో కోతకాలం వచ్చింది. ప్రతి ఏడు వచ్చే ఫలాదా యమునకు రెండింత లుగా పంట ఇంటికి చేరింది. దావీదుకు ఓబేదెదోము స్వయంగా ఈ సంగతులు విన్నవించు కున్నాడు. ఓబేదెదోము మాటలు విన్న తర్వాత దావీదుకు కొంత ధైర్యం వచ్చింది. దేవుని యొద్ద విచారణ చేసినప్పుడు ప్రభువు ఆమోదం తెలిపాడు.

దావీదు యాజకులను లేవీయులను తన యొద్దకు పిలిపించి మందసమును ఎత్తుటకును నిత్యము తనకు సేవ చేయుటకును యెహోవా లేవీయులను ఏర్పాటు చేసికొనెను. వారు తప్ప మరి ఎవరును దేవుని మందస మును ఎత్తకూడదు అని చెప్పి సాదోకును, అబ్యాతారును ఇంకా కొందరు లేవీయులను పిలిచి ఇంతకుముందు వారు ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా యొద్ద విచారణ చేయకుండుట చేతను ఆయన మనలో నాశనము కలుగ జేసెను. కావున ఇప్పుడు మీరును మీ వారును మిమ్మును మీరు ప్రతిష్ఠించుకొని నేను మందసమునకు సిద్ధపరచిన స్థలమునకు మందసమును తేవాలని చెప్పాడు.

అప్పుడు యాజకులు లేవీయులు ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా మందసమును తెచ్చుటకు తమను తాము ప్రతిష్ఠించుకున్నారు. ఓబేదెదోము ఇల్లు పట్టణమునకు ఆనుకొని ఉన్నది. అక్కడ నుండి కొండ ప్రదేశంలో ఎక్కి దావీదు పురమునకు చేరాలంటే అరమైలు ప్రయాణమే. అందరూ కలసి మందసము వద్దకు వచ్చారు.

మొదట లేవీయులలో ఏర్పరచబడిన వారు వారు తీసుకొని వచ్చిన బంగారముతో తాపడము చేయించిన కర్రలను మందసమునకు ఉండిన ఉంగరములలో దూర్చి పాటలు పాడువారు గంభీర తాళములు వాయించువారు ప్రారంభించగానే కర్రలతో మందసమును తమ భుజాల మీదకు ఎత్తుకున్నారు. వారు ఇంటి నుండి బయటకు రాగానే ఏడు కోడెలను బలిగా అర్పించారు. పాటలు పాడు వారందరూ సన్నపు నారతో నేయబడిన ఏఫోదును ధరించు కున్నారు. మందసముతో కదులుచున్న జనసముహపు ఆర్భాటం సీయోను కొండపైన ప్రతి ధ్వనించేటంత ఆర్భాటంగా యున్నది. యెహోవా మందసము మోయువారు ఆరేసి అడుగులు సాగగా ఎద్దు ఒకటియు క్రొవ్వినదూడ ఒకటియు వధింప బడెను. అందువలన మందసము నడక చాలా నిదానమైనది. **(సశేషం)**



# 'డ్యాన్స్ బేబి డ్యాన్స్'



'డ్యాన్స్ బేబి డ్యాన్స్', 'ఢీ', 'డ్యాన్స్ డ్యాన్స్' అని గెంతు లెయ్యడానికి రకరకాల పేర్లు పెట్టుకొని టి.వి. ప్రోగ్రామ్స్‌లో, స్టేజీల మీద అసభ్యకరమైన డ్యాన్సులు వేస్తుంటే అవి చూస్తూ మనం కూడా చాలా ఎంజాయ్ చేస్తాము కదా. 5 సం॥ల నుండి 70 సం॥ల వయస్సు వారి వరకు కూడా ఇలా స్టేజీల మీద డ్యాన్స్ చేయడం చాలా గర్వంగా ఫీలవుతుంటారు. కన్న తల్లిదండ్రులే చిన్నపిల్లలకి డ్యాన్సులు నేర్పించి స్టేజీలెక్కిస్తు న్నారు. వాళ్ళ డ్యాన్సులు చూసి మురిసిపోతుంటారు. అలా డ్యాన్సులు చేసే పిల్లలు పెరిగి పెద్దవాళ్ళయ్యేటప్పుడు, స్కూల్లో, కాలేజీల్లో కూడా స్టేజీల మీద డ్యాన్సులు చేస్తూ చివరికి క్లబ్బులు, పబ్బుల్లో కూడా డ్యాన్సు చేసే స్థాయికి ఎదిగి పోతారు. ఇలాంటి అన్యజనుల సంస్కృతి ఇప్పుడు చర్చీల్లోకి కూడా ప్రవేశించి, సండేస్కూలు పిల్లలకి స్టెప్పులు నేర్పించి స్టేజీల మీద డ్యాన్సులు చేయిస్తున్నారు. బాలుడు నడువవలసిన త్రోవను నేర్పించమంటే, ఇలా డ్యాన్సులు, స్టెప్పులు నేర్పించి అభం శుభం తెలియని పిల్లలను దేవునికి దూరం చేస్తున్నారు. ఎవరైనా ఇలా ఎందుకు అని నిలదీస్తే, తప్పేముంది దేవుని సన్నిధిలో దావీదు డ్యాన్సు చెయ్యలేదా అని సమర్థించు కుంటారు. 'ఆహా, సాతానా, పాస్టర్లు, తల్లిదండ్రులలో దూరి ఎంత చక్కగా మాట్లాడిస్తున్నావు, హ్యాట్సఆఫ్ టూ యూ' అని చెప్పాల్సిందే. ఇలానే బైబిల్లో 'నీ పాదములకు రాయి తగుల కుండ వారు నిన్ను తమ చేతుల మీద ఎత్తి పట్టుకొందురు' (కీర్తనలు 91:12, మత్తయి 4:6) అనే వాక్యము చూపించి యేసుప్రభువును బుట్టలో వేసుకోవాలని చాలా ప్రయత్నం చేసింది. ఇప్పుడు సోకాల్డ్ పాస్టర్లు కూడా 'దావీదు నాట్యము' చేసాడని బైబిల్లోవి చూపించి సమర్థించుకుంటున్నారు కదా, మరి అదే దావీదు వ్యభిచారము చేశాడు కదా అని వ్యభిచారం చేస్తారా? అసలు పిల్లలకు ఏమి నేర్పమని దేవుడు చెప్పాడో ఈనాటి క్రైస్తవ లోకానికి తెలిస్తే కదా! 'మీరు ఈ నా మాటలను మీ హృదయములోను మీ మనస్సులోను ఉంచుకొని... నీవు నీ యింట కూర్చుండునప్పుడు, త్రోవను నడుచునప్పుడు, పండుకొనునప్పుడు లేచునప్పుడు వాటిని గూర్చి మాటలాడుచు వాటిని మీ పిల్లలకు నేర్పి...' (ద్వితీయో. 11:18,19) అంటే వాక్యము నేర్పమని కదా దేవుడు చెప్పింది. మరైతే మనమేమి నేర్పిస్తున్నాము? నేర్పడానికి ఇంకేం లేవన్నట్లు దేవుని పాటలకి సినిమా స్టెప్పులు నేర్పించి అదేదో పెద్ద ఘనకార్యము చేసినట్లు గొప్పలు చెప్పుకోవడం సాతాను ప్లాన్‌లో భాగం కాదని అను కుంటున్నారా? చదవగలిగిన పిల్లలతో బైబిలు గ్రంథమును మొదటి నుండి చివరి వరకు పూర్తిగా చదివించొచ్చు గదా అని అడిగితే వాళ్ళు పిల్లలు కదా ఎలా చదువుతారని చెప్తారు, పెద్దవాళ్ళు వేసే సినిమా స్టెప్పులు మాత్రం అవలీలగా వేసేలా మంచిగా ట్రైనింగ్ ఇస్తారు. 'ఏది దేవుడనబడునో, ఏది పూజింపబడునో, దానినంతటిని ఎదిరించుచు, దానికంతటికి పైగా వాడు (సాతాను) తన్నుతానే హెచ్చించుకొనుచు, తాను దేవుడనని తన్ను కనుపరచుకొనుచు, దేవుని ఆలయములో కూర్చుండును గనుక ఏ విధముగానైనను ఎవడును మిమ్మును మోసపరచనియ్యకుడి' (2థెస్స. 2:4) అని హెచ్చరించినప్పటికీ వాక్యము తెలియని మూర్ఖులైన ఈ తరమువారు సాతానుచే మోసగింపబడుతూ తమ బిడ్డలను సాతానుకు అప్పజెప్తున్నారు. అందుకే సాతాను తానే వెలుగు దూత వేషము ధరించుకొని ప్రతిఒక్కరితో 'డ్యాన్సు బేబి డ్యాన్సు' ఆడిస్తూ పెద్దా, చిన్నా తేడా లేకుండా అందరిని దేవునికి దూరం చేస్తుంది. తల్లిదండ్రులారా, మీ బిడ్డల విషయం బీ కేర్‌ఫుల్.

**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

# దీనులైనవారు ధన్యులు

**"ఆత్మ విషయమై దీనులైన వారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది" (మత్తయి 5:3).**

ఈ భూమ్మీద పుట్టిన మనుష్యులు ఎవ్వరూ కూడా వారి ఆత్మను గురించి ఆలోచించరు. ఈ శరీరాన్ని నడిపించేది ఆత్మ అయినప్పటికీ ఎంతసేపటికి వారి శరీరం గురించే ఆలోచించుకుంటుంటారు తప్ప అసలు ఆత్మ అనేది ఒకటి ఉందన్న విషయమే పట్టించుకోరు. ఈ శరీరాన్ని పెంచి పోషించి సుఖపెట్టే విషయంలో చాలా శ్రద్ధ కనపరుస్తుంటారు. చనిపోయే వరకు యౌవ్వనంగా కనబడాలని శరీరానికి ఎన్నో మెరుగులు దిద్దుతుంటారు. చర్మ సౌందర్యం కోసం రకరకాల క్రీములు రాసుకుంటారు. అందంగా కనబడటానికి ఖరీదైన బట్టలు వేసుకుంటారు. ముఖం మీద చిన్న మచ్చ కనబడితే చాలా బాధపడిపోతారు. ఆ మచ్చ పోగొట్టుకోడానికి ఎంత డబ్బు అయినా ఖర్చు చేస్తారు. ఆత్మ శరీరంలో ఉన్నంత వరకే కదా శరీరానికి ఈ హంగూ, ఆర్భాటం ఉండేది. దేవుడను గ్రహించిన ఆత్మను నిర్లక్ష్యం చేస్తే మనం పరలోకరాజ్యానికి వెళ్ళము. *"మన్నయినది వెనుకటివలెనే మరల భూమికి చేరును, ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు మరల పోవును" (ప్రసంగి 12:7).* ఎవరూ కూడా తాము చనిపోతామన్న విషయం గురించి ఎప్పుడూ ఆలోచించరు. చనిపోతే ఈ శరీరం మట్టిలో కలిసి పోతుంది కదా, ఈ శరీరానికి ఇంత హంగు ఆర్భాటం అవసరమా అన్న ఊహ కూడా రానియ్యరు. ఒక మనిషి అని ఎవరినైనా పిలుస్తున్నామంటే అది ఆత్మనే కాని శరీరాన్ని కాదు. ఆత్మ శరీరాన్ని వదలి వెళ్ళిన తరువాత ఆ శరీరాన్ని ఎవరూ మనిషి అనరు. శవము అనో, కట్టె అనో పిలుస్తారు. దేవుడు ఆత్మ స్వరూపి. మనిషిని తన స్వరూపములో చేసుకున్నాడు. అంటే ఆయన చేసిన మట్టి బొమ్మలోకి జీవాత్మను ఊదినప్పుడు మాత్రమే మనిషిగా మారాడు. మనిషి రూపంలో ఉన్న ఆత్మను నాశనం చేయడానికి శరీరానికి సంబంధించిన ఎన్నో ఆశలను చూపించి లోపరచుకొని, ఆ ఆత్మను నరకానికి పంపడానికి సాతాను ఎన్నో పన్నాగాలను పన్నుతుంది. అయితే దేవుడు కూడా తను భూమ్మీదకు పంపించిన ఆత్మను సాతాను బారి నుండి కాపాడటానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటాడు. దేవుడు అనుగ్రహించిన మన ఆత్మను నరకానికి పంపడానికి సాతాను అనేక రకాలుగా శరీర సంబంధమైన సుఖాలకు అలవాటు పడేలా ప్రలోభపెడుతుంది. శరీరానికి ఎక్కువ విలువ ఇచ్చే వారికి దీనమనస్సు ఉండదు. గలతీ. 2:20లో వ్రాయబడిన ప్రకారము *"ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్ను తాను అప్పగించుకొనిన దేవుని కుమారునియందలి విశ్వాసము వలన జీవించుచున్నాను"* అని అనుకొనేవారు పరలోకములో యేసుతో కలిగి జీవించాలనుకుంటారు. వారికి వారి ఆత్మ విషయమైన దీనత్వం వస్తుంది. కాబట్టి ఆత్మ విషయంలో మనం ఎంతో జాగ్రత్తగా ఉండాలి. మన ఆత్మ పరలోకము పోవాలన్నా, నరకానికి పోవాలన్నా అది మన చేతుల్లోనే ఉంది. మనం మన శరీరానికి విలువ ఇస్తే మన ఆత్మ నరకానికి, ఆత్మకి విలువ ఇస్తే పరలోకానికి వెళ్తుంది. ఎవరైతే ఆత్మ విషయమై శ్రద్ధ కలిగి, తన ఆత్మ నశించి నరకానికి పోకుండా పరలోకం పోవాలని కోరుకొని దేవునికి ఇష్టమైన జీవితం జీవిస్తూ, శరీరాన్ని తృణీకరించుకొని దీనత్వం కలిగివుంటారో వారిదే పరలోకరాజ్యము.

**సాక్ష్యాలకు ఆహ్వానము**

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యం ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడలవాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

# సృష్టికర్త

దేవుడు మూడవ దినమున చేసిన సృష్టిలో భూమి, భూమిపైని వృక్షసంపదతో పాటు సృష్టించిన మరో అద్భుతం సముద్రము.

"దేవుడు ఆకాశము క్రిందనున్న జలములొక చోటనే కూర్చబడి ఆరిన నేల కనబడును గాకని పలుకగా ఆ ప్రకార మాయెను. దేవుడు ఆరిన నేలకు భూమి అని. జల రాశికి ఆయన సముద్రములని పేరు పెట్టెను" (ఆది. 1:9,10).

నేటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానముతో మానవుడు ఇప్పటి వరకు కనుగొన్న సముద్రం యొక్క అత్యధిక లోతు 11,000 కిమీ. ఈ లోతు ఎవరెస్ట్ శిఖరం కంటే దాదాపు 8000 మీటర్లు ఎక్కువ. ఇక్కడ మనిషి ఊపిరితిత్తులు పగిలిపోయి చనిపోయేంత నీటి ఒత్తిడి ఉంటుంది. అంటే ఈ పాయింట్లో మనిషి మీద దాదాపు 8 టన్నుల బరువు ఉంటుంది. ఇది 50 జెంబోజెట్ విమానాల బరువుతో సమానం. ఇప్పటి వరకు సముద్రపు డైవర్స్ వెళ్ళగలిగిన లోతు కేవలం 214 మీటర్లు మాత్రమే. సముద్రంలో 1000 మీటర్ల తరువాత సూర్యకిరణాలు కూడ ప్రసరించలేవు. అత్యంత చీకటిగా ఉంటుంది. అందుకే ఇక్కడ నివసించే జీవరాశులు భూమి మీద మిణుగురు పురుగులవలె సహజం గానే కాంతిని వెదజల్లుతుంటాయి. ఉదా జెల్లిఫిష్.

ఇప్పటి వరకు శాస్త్రవేత్తలు 1.5 మిలియన్ రకాల సముద్ర జీవరాశులను కనుగొన్నారు. అయితే ఇది సముద్రంలో ఉన్న మొత్తం జీవరాశులలో కేవలం 5% మాత్రమే. ఇంకా దాదాపు 2-50 మిలియన్ రకాల జీవజాతులు సముద్ర గర్భంలో ఉన్నాయని అంచనా. మొత్తం భూభాగంలో దాదాపు 71% సముద్రాలతో(నీటితో) నిండి ఉంది.

భూమి మీద ఉండే మొత్తం నీటిలో కేవలం 1% నీరు మాత్రమే మంచి నీరుగా మనం డైరెక్ట్‌గా వాడుకోదగిన స్థితిలో ఉన్నది. 97% ఉప్పునీరు (సముద్రపు నీరు)కాగా మిగిలిన 2% నీరు మంచుపర్వతాలో రూపంలో ఉన్నది. ఒక మంచు పర్వతాన్ని కరిగించగా వచ్చే నీరు 10లక్షల మందికి 5 సంవత్సరాల పాటు సరిపోతుందట.

నదీప్రవాహంలో రాళ్ళు నీటికోతకు గురౌతాయి తద్వారా మెగ్నీషియం, సోడియం, కాల్షియం వంటి రకరకాల ఖనిజాలు నీటిలో కలుస్తాయి. ఈ మినరల్స్ నీటిలోని జీవరాశులకు ఉపయోగపడతాయి.

సముద్రపు నీటిలో దాదాపు 2కోట్ల టన్నుల బంగారం ఉందని శాస్త్రవేత్తల అంచనా. ఈ బంగారం మొత్తాన్ని వెలికితీస్తే ఈ భూమ్మీద ఉండే ప్రతి మనిషికి దాదాపు 4కేజీల బంగారం ఇవ్వవచ్చుట. కాకాపోతే సముద్రపు నీటి నుండి బంగారాన్ని వెలికితీయడం అత్యంత కష్టమైన, అత్యంత ఖర్చుతో కూడుకున్న పని. ఎందుకంటే 1లీటర్ సముద్రపు నీటిలో గ్రాములో 13,00,00,00,000 వంతు బంగారం మాత్రమే ఉంటుందట.

తుఫానులు, యుద్ధాలు వంటి రకరకాల కారణాల వలన దాదాపు 30లక్షల నౌకలు సముద్రగర్భంలో ఉన్నాయి. 60 బిలియన్ డాలర్లు అంటే దాదాపు 4లక్షల కోట్లు విలువ చేసే నౌక సంపద సముద్రగర్భంలో నిక్షిప్తమై ఉన్నది.

సముద్రంలోపల, రకరకాల జీవరాసులు, నదులు, అడవులు, లోయలు, పర్వతాలు, అగ్నిపర్వతాలు ఉంటాయి. నమ్మశక్యంగా లేకున్నా సముద్రం లోపల ఒత్తిడి కారణంగా నదులు ప్రవహిస్తుంటాయి. అలాగే రకరకాల బాక్టీరియాలు సముద్రపు అట్టడుగున ఉండే రాళ్ళ మీద నాచు, కొన్నిరకాల చెట్లు, మొక్కలు ఏర్పడుటకు కారణమౌతాయి. సముద్రపు నాచుగుట్టలనే పగడపు దిబ్బలు అని అంటారు.

ఊహించలేని, వర్ణించలేని అద్భుతమైన సృష్టిని మన కళ్ళ ముందుంచిన సృష్టికర్తకు దాసోహం అవ్వడమే మానవ జన్మ సార్థకత.

సాక్ష్యము

# మారుమనస్సు

మా స్వగ్రామం ఓగిరాల. గుడివాడ దగ్గర చాలా చిన్న పల్లెటూరు. తాతగారి దగ్గర పెరిగాను. మా ఊరిలో పాఠశాల లేదు. 13 సంవత్సరాలు చదువు లేకుండానే అయోమయంలో పెరిగాను. వివాహం డబ్బున్న వ్యాపారితో జరిగింది. ముగ్గురు మగపిల్లలు పుట్టారు. పెండ్లి కాగానే విజయవాడ వచ్చాము.

అమాయకంగా బ్రతుకుతూ ఉండేదాన్ని. యింటి ప్రక్కన ఉండే ఆదెమ్మ అనే స్త్రీ మొదటిగా ప్రభువైన క్రీస్తు రక్షకుడని, అవసరాలు తీర్చగలడని అసహాయతలో సహాయకుడని బాధలు సమస్యలన్నీ చెప్పుకోవచ్చుని చెప్పి ప్రార్థనలకు నడిపించింది. ప్రార్థనలు, మీటింగులో బైబిలు చదివే వారిని చూస్తూ, చెప్పేది ఒకటి చేసేది ఒకటి, నాకు చదువస్తే వీళ్ళకు సరిగ్గా జవాబు చెప్పాలి. స్టేజి ఎక్కి వీళ్ళ లాగా మాట్లాడితే బాగుండు అని తలంచే దానను. ఆదెమ్మ గారు పరిచయమైన రోజుల్లో క్రీస్తు అంటే ఎవరో తెలియదు.

మేము అమాయకంగా ఏమాత్రం ఆలోచించక డబ్బు అంతా ముందే చెల్లించి ఒక స్థలం కొనడానికి అగ్రిమెంట్ వ్రాసుకున్నాం. మాట్లాడుకున్న దాని ప్రకారం డబ్బంతా శ్రీ బండారు భూషయ్యగారికి ఇచ్చివేశాము. కానీ రిజిస్ట్రేషన్ చేసికోలేదు. విధివశాత్తు, ఆయనకు పచ్చ కామెర్లు వ్యాధి వచ్చి అది తీవ్రమై కోమాలోకి వెళ్ళిపోయాడు. మేము డబ్బిచ్చిన సంగతి ఆయన కుమారులకు తెలియదు, ఋజువులు లేవు. నేను భయంతో దుఃఖపడే రోజుల్లో యేసు సమస్యలన్నీ పరిష్కరిస్తారు యేసును నమ్ముకోమని కొంతమంది విశ్వాసులు చెప్పారు.

నాకు తెలిసి తెలియని జ్ఞానంతో ఈ యిల్లు సమస్య తీరిస్తే యేసు గొప్పవాడని నమ్మి, క్రొవ్వొత్తులు వెలిగిస్తానని మ్రొక్కుకున్నాను. నేను తెలిసీ తెలియని ప్రార్థన చేశాను. భూషయ్యగారికి కోమా నుండి తెలివి వచ్చి మాట్లాడసాగారు. "నేను కష్టాల్లో ఉన్నప్పుడు డబ్బు యిచ్చారు. నా బిడ్డలారా, ఈమెను మోసం చేయవద్దు అని చెప్పారట. విషయం చెప్పిన వెంటనే 1 గం॥లోనే సృహ కోల్పోయారు.

నా ప్రార్థనకు జవాబు విజయం కల్గింది. నేను కాస్త నమ్మాను గాని సంపూర్ణంగా హృదయాన్ని సమర్పించుకోలేదు. సినిమాలంటే యిష్టత ఉండేది. ఆదెమ్మ నాతో చెప్పింది ఏమిటంటే 'నీకు విశ్వాసం లేదు. మందిరానికి రాకుండా సినిమాకు వెళ్ళుచున్నావా' అని తీవ్రంగా గద్దించింది. ఆదెమ్మ మా యింట్లో అద్దెకి ఉండేది. నాకు హక్కు ఉందనే ధీమాలో 'నీవెవరివి నాకు బుద్ధి చెప్పడానికి? యిల్లు ఖాళీ చేయించేస్తాను జాగ్రత్త' అన్నాను. ఆమెకు 55 సం॥ వయస్సు అప్పట్లో నాకు 17 సం॥ మాత్రమే. ఆదెమ్మ దీనురాలు. మంచి విశ్వాసి. నాకోసం నా గర్వమైన మనస్సుకోసం భారంతో ప్రార్థించింది. ప్రభు ఆమెను మాట్లాడి 'బుజ్జమ్మను ఎందుకు గద్దించావు? క్షమాపణ కోరుకో' యీ మాటలు దేవుని వద్ద నుండి శబ్ద రూపంలో వినబడ్డాయట. అదే మాట మూడుసార్లు వినబడింది. మూడవసారి సూర్యుడుదయించక ముందే క్షమాపణ కోరమని కూడా దేవుడు తెల్పారట. ఆ ఉదయమే పెందలకడ ఆదెమ్మ నా కాళ్ళు చుట్టుకొని 'అమ్మా క్షమించు తల్లీ' అని పసిపిల్లలాగా ఏడ్చింది. దేవుడు మాట్లాడగలడా అని అడిగాను, మందిరానికి ఆహ్వానించింది. బ్రదర్ దేవదత్తంగారు పటమటలో సహవాసంలో ఏర్పరచారు. స్వంత కంపెనీలో ఉద్యోగి. ప్రస్తుతం వారబ్బాయి సుధాకర్‌గారు సంఘం నడిపిస్తున్నారు. వారి సహవాసంలో ఆత్మీయంగా బలపడ్డాను.

అంతకుముందు క్రైస్తవ పద్ధతులు తెలీదు. సంఘ ప్రార్థన క్రమము, వాక్యధ్యానం, రక్షణకై నిరీక్షణ, పాపపు ఒప్పుకోలు రక్షణలో స్థిరత్వం. క్రీస్తు రక్తం యొక్క శక్తి యివన్నీ తెలిసికోగల్గాను. 1979 సం॥రంలో 11 నెలలు క్రైస్తవ ఆరాధనలో ఆత్మీయంగా సిద్ధపడ్డాను. 11వ నెలలో ప్రభువును నన్ను దర్శించి రక్షణనిచ్చారు. ఆయన స్వరం వినవచ్చునన్న ఆశ బలంగా ఉండేది. అనుకోకుండా ఒక రోజు మార్కెట్‌కి వెళ్ళగా ఒక శబ్దం వినబడింది. నడి

బజారులో ఆ స్వరం వినబడింది. అది దేవుని స్వరం అని నాకు అర్థమయింది. ఒక్క అడుగు ముందుకు సాగలేదు.

'నీవు మరణమైతే ఏమి చేస్తావు? నీవు చనిపోతే ఎక్కడ గడిపెదవు?' అనే స్వరం వినపడగా, నాకు చాలా భయం వేసింది. ఇప్పుడే లారీ గ్రుద్దితే నాగతి ఏమి? అని తలంచి 'ప్రభువా నేను పాపిని నన్ను రక్షించు' అని పశ్చాత్తాపంతో ప్రార్థించాను.

నీకు సాక్షిగా బ్రతుకుతానని కూడా చెప్పాను. ఆ తర్వాత 1980 జనవరి 1వ తారీఖున అదే సహవాసంలో బాప్తిస్మం తీసుకున్నాను. ఇంటికి వచ్చి గోడకానుకొని నన్ను దర్శించు ప్రభువా అన్నాను. అది పగలు 11 గం॥ల సమయం. మెళకువగానే ఉన్నాను. ఒక దర్శనాన్ని చూచాను. ఒక పెద్దనది. ఆ నదిలో నిలబడ్డాను. దగ్గరకు పిలిచారు. ప్రభూ నీవు పరిశుద్ధుడవు అని అనుకున్నాను.

ఆ ప్రభువు నవ్వుతూ దగ్గరకు పిలిచి రెండు చేతులు నా తలపై ఉంచి, చుట్టూగల నీటిలో ముంచి అభిషేకించారు. నేను ఆయన చేతిలో బొమ్మ రూపంలో ఉన్నాను.

"నీవు అడుగుపెట్టిన ప్రతి స్థలంలో నిన్ను ఆశీర్వదిస్తాను. నేను వెళ్ళమన్న స్థలాలకు వెళ్ళు. దయ్యాలు, చేతబడి, స్వస్థతల మీద పూర్తి స్వస్థతావరం యిస్తాను" అన్న మాటలు విన్నాను. వెంటనే ప్రార్థించుట ఆరంభించాను.

1989లో మా ఇంటి దగ్గర కృపాజ్యోతి గారబ్బాయి గాలిపటం ఎగరవేస్తూ మీద మీద నుండి వెనక్కు పడిపోయి సృహకోల్పోయాడు. డాక్టర్లు ఆశవదిలి చనిపోయినట్లే అని చెప్పి వదిలిపెట్టారు. యేసు నామమున నూనె వ్రాసి ప్రార్థించాము. ఆ రాత్రంతా బాబుతో ఉండి ప్రార్థిస్తూ నిద్రపోయాము. అయితే ఉదయాన్నే మాకన్నా ముందే బాబు లేచి మమ్ములను లేపి, నాకు ప్రభువు ఔషదమిచ్చి లేపారు. నాకు బాగుంది. ఆకలిగా ఉంది అన్నం పెట్టండి అన్నాడు" యిప్పుడా బాబుకి పెండ్లయి యిద్దరమ్మాయిల తండ్రి అయ్యాడు. జ్వరంతో బాధపడు ఒకరికై ప్రార్థించగా తగ్గింది. మరొకరికి పాముకాటువల్ల నురగలు గ్రక్కుతుండగా పుండుపై నూనె ప్రార్థించి రాసి, యేసు నామమున, యేసు రక్తంగా ధ్యానించి రాయగా తగ్గింది. దర్శనం ద్వారా ఐదు వేళ్ళలో వెల్డింగుచేయు కరెంటు మంట ఫీలింగుతో శక్తిని పొంది దయ్యాలు పారిపోవుట చూచాను.

నేను బలపడిన తర్వాత ప్రార్థనా పూర్వకముగా ఎన్నో మేలులు పొందిన వారిని రక్షణ అనుభవాన్నికి సిద్ధపరచి పెంతెకోస్తు సీనియర్ పాస్టర్ గారైన దానియేల్ గారి ఆధ్వర్యాన బాప్తిస్మ అనుభవానికి ప్రభువు నామాన ఆయన రక్త శక్తితో జరిగిన అద్భుతాలను బట్టి దేవునికే మహిమ ఘనత.

ఎజ్రా సద్గుణంగారు నన్ను పాస్టరు కోర్సు చేయమని సలహాయిచ్చారు. 3 సం॥ బైబిలు ట్రైనింగులో వ్రాయడం చదవడం మాట్లాడడం బోధ చేయడం నేర్చుకున్నాను. ఇంగ్లీషు అర్థం చేసికోగలను ఆడియో క్యాసెట్లు ద్వారా అర్థం చేసుకోవడం పరిశుద్ధాత్మ కృప మాత్రమే. అవసరతనుబట్టి ఈ పనులు చేయగల్గటం యేసుక్రీస్తు కృపయే.

ఒట్టిదానను మట్టిదాననైన నన్ను నాలో ఆయన స్వస్థ శక్తి అనే ఐశ్వర్యమును ఇచ్చి నన్ను వాడుకొన్న దేవునికే మహిమ ఘనత, హల్లెలూయా! నేను ఎవరి సహకారాన్ని అందుకోలేదు. ప్రభువు ప్రేమ నన్ను బలవంతము కొద్ది ప్రార్థనా గుంపును తర్ఫీదు చేసే కృప ప్రభువు ఇచ్చారు. సంఘ అవసరతలు, దేశ విదేశాలలో విశ్వాసుల ఆత్మీయ సంరక్షణలో అవిశ్వాసుల ఆత్మ రక్షణ కొరకు, కొన్ని సమస్యల నెరవేర్పు కొరకు, వ్యాధుల స్వస్థత కొరకు, వివిధ ప్రాంతాలలో క్రీస్తు సేవ కోసం, పరిశుద్ధాత్మ శక్తి కొరకు, నడిపింపు కొరకు ప్రార్థిస్తాము. ప్రతి శనివారము ఉపవాస వ్రత ప్రార్థనలు రాత్రి 9.00 గం॥ల నుండి ఆదివారం ఉదయం 6.00 గం॥ల వరకు ప్రార్థనలు జరిగించబడుతున్నాయి. దానికై వచ్చిన 20-25 మందిని సమకూర్చుతాను. ప్రార్థనా భారమునుబట్టి 45 రోజులకు గానీ రెండు నెలలకు గానీ వారమంతా ఉదయం 10 గం॥ల ఒక బ్యాచి, రెండవ బ్యాచి రాత్రి 10 గం॥లకు ప్రార్థనలో గడుపుతాము.

దేవుడిచ్చిన జ్ఞానముతో, నాకు తోచిన విధముగా దేవుని సేవ చేయుటలో మా వంతు కృషి మేము చేస్తున్నాము. మా కొరకు, మా సంఘ ఆత్మీయ అభివృద్ధి కొరకు ప్రార్థించ మనవి.

## ఇశ్రాయేలుకు (క్రైస్తవులకు)
# తెలివిలేదు, యోచింపరు

బైబిలు చదవటానికి అమితంగా బద్ధకించే క్రైస్తవులు వాక్యము విషయంలో సులువుగా మోసగించబడుతుంటారు. చర్చికి వెళ్తే చాలు పరలోకరాజ్యము పోతామన్న భ్రమలో ఉన్న క్రైస్తవులు చర్చిని ఒక విగ్రహంగా మలుచుకొని, పాస్టరును దైవాంశ సంభూతుడు అనుకుంటారు. పాస్టరు ఏం చెప్పినా అది దేవుడు చెప్పినట్లుగా భావించి వారు చెప్పినట్లు చేయడం వల్లనే అబద్ధ బోధకులు పుట్టుకొస్తున్నారు. వారిని కనిపెట్టడం బైబిలు జ్ఞానములేని క్రైస్తవుల వలన కాదు. సంఘకాపరులు ఎలాంటి తప్పు చేసినా నిలదీయలేనంతగా వారికి భయపడుతుంటారు. ఇప్పుడే కాదు పాతనిబంధన కాలంలో కూడా ఇలాంటి కాపరులు ఉన్నారు. వారి గురించి యెషయా గ్రంథములో "వారి కాపరులు గ్రుడ్డివారు వారందరు తెలివిలేనివారు వారందరు మూగ కుక్కలు మొరుగలేరు కలవరించుచు పండుకొనువారు నిద్రాసక్తులు. కుక్కలు తిండికి ఆతురపడును, ఎంత తినినను వాటికి తృప్తిలేదు. ఈ కాపరులు అట్టివారే వారు దేనిని వివేచింపజాలరు వారందరు తమకిష్టమైన మార్గమున పోవుదురు ఒకడు తప్పకుండ అందరు స్వప్రయోజనమే విచారించుకొందురు" (యెషయా 56:10,11) అని వ్రాయబడింది.

కాపరుల గురించి యిర్మీయా గ్రంథంలో "నా ప్రజలు త్రోవ తప్పిన గొఱ్ఱెలుగా ఉన్నారు వారి కాపరులు కొండల మీదికి వారిని తోలుకొని పోయి వారిని త్రోవ తప్పించిరి జనులు కొండకొండకు వెళ్లుచు తాము దిగ వలసిన చోటు మరచిపోయిరి" (యిర్మీయా 50:6).

యెహెజ్కేలు గ్రంథంలో "నరపుత్రుడా, ఇశ్రాయేలీయుల కాపరులనుగూర్చి ఈ మాట ప్రవచింపుము, ఆ కాపరులతో ఇట్లనుము ప్రభువగు యెహోవా సెలవిచ్చునదేమనగా తమ కడుపు నింపుకొను ఇశ్రాయేలీయుల కాపరులకు శ్రమ; కాపరులు గొఱ్ఱెలను మేపవలెను గదా. మీరు క్రొవ్విన గొఱ్ఱెలను వధించి క్రొవ్వును తిని బొచ్చును కప్పుకొందురుగాని గొఱ్ఱెలను మేపరు, బలహీనమైనవాటిని మీరు బలపరచరు, రోగముగలవాటిని స్వస్థపరచరు, గాయపడిన వాటికి కట్టు కట్టరు, తోలివేసిన వాటిని మరల తోలు కొనిరారు, తప్పిపోయిన వాటిని వెదకరు, అది మాత్రమేగాక మీరు కఠిన మనస్కులై బలాత్కారముతో వాటిని ఏలుదురు. కాబట్టి కాపరులు లేకయే అవి చెదరిపోయెను, చెదరిపోయి సకల అడవి మృగములకు ఆహారమాయెను. నా గొఱ్ఱెలు పర్వతములన్నిటి మీదను ఎత్తయిన ప్రతి కొండమీదను తిరుగులాడుచున్నవి, నా గొఱ్ఱెలు భూమియందంతట చెదరి పోయినను వాటిని గూర్చి విచారించు వాడొకడును లేడు, వెదకువాడొకడును లేడు... కాపరులు లేకుండ నా గొఱ్ఱెలు దోపుడు సొమ్మయి సకలమైన అడవి మృగములకు ఆహార మాయెను; కాపరులు నా గొఱ్ఱెలను విచారింపరు, తమ కడుపు మాత్రమే నింపుకొందురు గాని గొఱ్ఱెలను మేపరు; ఇదే ప్రభువైన యెహోవా వాక్కు. (యెహెజ్కేలు 34:2-8).

క్రొత్త నిబంధనలో అబద్ధ బోధకుల గురించి "మరియు అబద్ధప్రవక్తలు ప్రజలలో ఉండిరి. అటువలెనే మీలోను అబద్ధబోధకులుందురు; వీరు తమ్మును కొనిన ప్రభువును కూడ విసర్జించుచు, తమకు తామే శీఘ్రముగా నాశనము కలుగజేసికొనుచు, నాశనకరమగు భిన్నాభిప్రాయములను రహస్యముగా బోధించుదురు" (2పేతురు 2:1).

దేవునియందు భయభక్తులు కలిగి యుండి క్రమమైన మార్గంలో నడవాలంటే కేవలం బోధకుల మీద ఆధారపడకుండా బైబిలును పరిశీలనగా చదవాలి. మీకు అర్థం కాకపోతే దేవుడు మీకు తెలియజేస్తాడు. "మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్నయెడల అతడు దేవుని అడుగవలెను, అప్పుడది అతనికి అనుగ్రహింపబడును. ఆయన ఎవనిని గద్దింపక అందరికిని ధారాళముగ దయ చేయు వాడు" (యాకో. 1:5). దేవుని కంటే గొప్ప బోధకుడు ఎవరూ లేరు. కాబట్టి మీ ఆధ్యాత్మిక స్థితి మెరుగుపడాలంటే కేవలం దేవుని మీదనే ఆధారపడండి. తెలివిలేని, యోచింపని క్రైస్తవులు మాత్రమే బోధకుల మీద ఆధారపడతారు. **(సశేషం)**


10

# బైబిల్ ప్రాముఖ్యత

రక్షణ విషయంలో ఎదుగుదలకు వాక్యమను పాలు ఎంతయినా అవసరము. 1పేతురు 2:1-3 "క్రొత్తగా జన్మించిన శిశువులను పోలిన వారై, నిర్మలమైన వాక్యమను పాల వలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము, ఆ పాలను అపేక్షించండి".

ఈ విధముగా చెప్పుకుంటూ పోతే ఇంకా అనేక దృఢమైన కారణాలు ఉంటాయి. ఏదేమైనప్పటికీ దైవవాక్యం మన అనుదిన ఆత్మీయ జీవితమునకు ఎంతైన శక్తినను గ్రహించి ఆత్మీయ జయజీవితమునకు దోహదకరము.

ఈ నిత్యజీవజలమైన బైబిలును మనము తప్పక ధ్యానించవలెను. ఈ దేవుని వాక్యం ఎన్నో జీవిత సమస్యలకు జవాబు నిస్తుంది. మానవ జాతికి నిజమైన ప్రేమగలిగిన స్నేహితుడైన యేసు క్రీస్తును పరిచయం చేస్తుంది. దాసుని స్వరూపమును ధరించుకొని, దేవుడై యుండి తన్ను తాను రిక్తునిగా చేసు కొని సిలువ మరణం పొందునంతగా విధేయత చూపిన ఆయన, తన మూడన్నర సంవత్సరాల సేవాకాలములో రాత్రనక పగలనక సువార్త ప్రకటించి కార్యసిద్ధితో "నీ చిత్తమే జరుగును గాక" అని తన ప్రశస్థ పరిశుద్ధ రక్త మును చిందించి శరీరమందు నలుగగొట్టబడి, మన ఆత్మ లకు రక్షణ, శరీరమునకు స్వస్థత దయచేసి మరణ పునరు త్థానముల ద్వారా మనకు పాప విమోచన, పునరుత్థానం దయచేసి ఆయన దేనికి శిల్పియు, నిర్మాణకుడనైయున్నాడో అట్టి పట్టణములో తండ్రితో సహ వసించు భాగమును కలిగించిన ఆ యేసయ్య పూర్తి వృత్తాంతమును ఈ నిత్య జీవజలములో తెలుసుకుంటాం. ఈ రోజుల్లో చాలామంది క్రైస్తవులు జీవగ్రంథమును జీవితంలో ఒకసారైనా తెరువని వారున్నారంటే ఆశ్చర్య పడవలసిన అవసరంలేదు.



బైబిలును చేతితో పట్టుకొని వీధిలో నడవడానికి సిగ్గుపడతారు. సంఘంలో నోరు తెరచి పదిమందిలో చదవడానికి సిగ్గుపడతారు. చాలామంది క్రైస్తవులకు ఇందులో 66 పుస్తకములున్నవని తెలియదు. పుస్తకముల క్రమం తెలియక తికమక పడే అనేకమంది క్రైస్తవులనబడే స్నేహితులు నాకు తెలుసు. ఈ క్రమం తెలుసుకొంటేనే పరలోకరాజ్యములోనికి ప్రవేశిస్తామని నేననను. అయితే క్రైస్తవులమైన మనం ఈ పుస్తకం ఏమి చెప్తుందో తెలుసు కుంటే కష్ట సమయాలలో మనలను ఊరటపరచే ఆ వాక్యభాగములను మనం పఠించవచ్చు కదా! సాధారణ సంఘ సభ్యులు మాత్రమే కాదు సంఘ నాయకులన బడే అనేకమంది ప్రసంగీకులు కూడా బైబిల్ ద్వారా మనకు వెచ్చించే సమయం చాలా తక్కువ. ఎందుకంటే అవిరామముగా దేవుని పని చేస్తున్నా మంటారు. మనం దేవుని పేరట ఇత రులతో గడిపే సమయం కంటే దేవునితో ముఖాముఖిగా గడిపే సమయమే దేవునికి ఇష్టం. లాజరు సహోదరి మరియ 'ఉత్తమమైనది' కోరుకున్నదని యేసయ్య చెప్పటం మనం జ్ఞాపకం చేసుకోవచ్చు. ఈ లోకంలో జరిగే విషయాలు తెలుసుకోవాలని, వాటిని గురించి చదవాలని అనేకమంది దినపత్రికలు, వారపత్రికలు, నవలలకు ఎంతో ధనం, సమయం వెచ్చిస్తారు. అయితే బైబిల్ చదవటానికి.....?

క్రైస్తవ ఆధ్యాత్మిక జీవితానికి బైబిల్ పఠనం ఎంతో అవసరం. బైబిలును గురించి మహామేధావులు ఈ విధంగా వర్ణించారు

"బైబిలు దేవుడు మానవులకు ఇచ్చిన గొప్ప వరం. దేవుని ద్వారా వచ్చు ప్రతి ఆశీర్వాదం ఇందు పొందు పరచబడి ఉంది" -అబ్రాహాంలింకన్,

"బైబిల్ వట్టి పుస్తకం కాదు, అది జీవము, శక్తి కలిగి తన్ను వ్యతిరేకించు వారిని జయించగలిగిన గ్రంథం" – నెపోలియన్,

"చరిత్రలోనైనా అబద్ధం చోటు చేసుకోవచ్చు కాని బైబిల్ ఒక స్వచ్ఛమైన చరిత్రను చాటుతుంది" –సర్ ఐజాక్ న్యూటన్

"దేవుడు, దేవుని వాక్యము లేకుండా ప్రజాపాలన చాలా కష్టతరం" జార్జివాషింగ్టన్లు వర్ణించారు.

15 సంవల మేరిజోన్స్ "నా జీవితంలో బైబిలును తప్ప మరిదేన్ని కోరుకోను" అనే పట్టుదలతో దాదాపు ఆరు సంవలు కష్టపడి డబ్బు దాచుకొని, కొన్ని మైళ్ళు ఒంటరిగా నడచి వెళ్ళి బైబిల్ కొనుక్కుంది. ప్రతి వ్యక్తి బైబిల్ ప్రకారం జీవించటం, బైబిల్ చదువుతూ ఆధ్యాత్మిక విలువలు నేర్చుకుంటూ, మన మనస్సులను పవిత్రంగా, మనస్సాక్షిని నిష్క ళంకంగా ఉంచుకొనుటకు నేర్చుకోవా ల్సిన అవసరత ఈ అంత్య దినాలలో ఎంతయినా ఉంది.

అవును, బైబిల్ పాఠములు, ప్రసంగములు, క్రైస్తవ మాసపత్రికలు, సాక్ష్యములు మరియు ఇతర ఆధ్యాత్మిక ప్రచురణలు చదువుట ద్వారా కొంతలో కొంతైనా ఆత్మీయ మేలులు పొందుతామనే విషయం ఒప్పుకుంటాను. అయితే అనుదిన పఠనం కొరకు చిన్న చిన్న పుస్తకాలు ముద్రించ బడుచున్నవి. వివిధ క్రైస్తవ ప్రచురణలలో ప్రకటనల ద్వారా వాటి సంఖ్య కూడా వృద్ధి చెందుతుంది. ఇవి మంచివే కాని మన ఆధ్యాత్మిక ఎదుగుదలకు బైబిలు అన్నింటికన్నా వాడియైన ఎటువంటి ఖడ్గముకంటే పదునైనది. ఆ పరిశుద్ధ గ్రంథమును వ్యక్తిగతంగా చదివితే, ప్రార్థనతో చదువుట ప్రారంభిస్తే, ప్రభువా నీవాక్యంతో మాట్లాడయ్యా అని వినయంగా ప్రార్థిస్తే, ఆ మెల్లనైన మధురమైన ఆయన స్వరం ఎంతో ఎంతెంతో ఆత్మీయ మేలులను ఇస్తుంది. ఆయన పలికే ప్రతి మాట జీవాన్ని, వెలుగుని జీవితానికి ఇస్తుంది. ఇది ప్రతి వ్యక్తికి అవసరమైన, వ్యక్తిగతమైన స్పర్శ. ఇది మన రాతి హృదయాన్ని సంధించే బలమైన దేవుని స్పర్శ.

**(సశేషం)**

**(22వ పేజీ తరువాయి...)**

పేలిందని, గత ఆరు నెలలో విడుదలైన అన్ని ఎలక్ట్రిక్ బైక్స్ పరిస్థితి ఇంతే అని, ప్రాణాపయం లేకున్నను అందుకు తగిన నష్టపరిహారం కావాలని లాయర్‌తో మాట్లాడుతున్న రీమా తండ్రి మాటలు వినగానే విషయం అర్థమైంది లిఖితకు. ఒక్క క్షణం తండ్రి మాటలు గుర్తుకు వచ్చాయి. నిజంగానే దేవునిసమయం అంటూ ఉంటుందేమో అనిపించింది లిఖితకు.

ఇంతలో మరో మూడు నెలలు గడిచాయి. రోజులానే ఇంటికి వచ్చిన లిఖితతో తల్లి మనం వారం రోజుల్లో ఇల్లు మారుతున్నాం. కాబట్టి నీ వస్తువులు నీట్‌గా ప్యాక్ చేసుకో అని చెప్పింది. ఆ మాట విన్న లిఖితకు ముందు సంతోషంగా అనిపించిన అసలు ఇల్లెందుకు మారుతున్నామో అర్థం కాలేదు. అందరూ క్రొత్త ఇంటికి వెళ్ళే పనుల్లో బిజీగా ఉన్నారు. వారం తరువాత క్రొత్త ఇంటికి వెళ్ళిన లిఖితకు నోట మాటలేదు. ఎందుకంటే ఆ క్రొత్త ఇల్లు అంత బాగుంది. అంతేకాదు ఇంటి ఆవరణలో ఉన్న కారును చూసిన లిఖిత – డాడీ కారు కూడా మనదేనా అని అడిగింది సంతోషంగా. అవును తల్లి ఇల్లు, కారు మన సొంతమే ఇదే దేవుని సమయం అన్నాడు నవ్వుతూ.

తనకు రావలసిన ప్రమోషన్ రావడమే కాక ఆలస్యానికి నష్టపరిహారంగా, ప్రమోషన్‌కు గిఫ్ట్‌గా కంపెనీ కారును ఇచ్చిందని, తొమ్మిది నెలల హైక్‌తో జీతం కూడా ఒకే మొత్తంగా రావడంతో డౌన్‌పేమెంట్ చెల్లించి ఇల్లు కొనడం జరిగిందని తండ్రి మాటలు ద్వారా తెలుసుకున్న లిఖిత ఆశ్చర్యంతో పాటు దేవుని సమయం అంటే ఏమిటో అనుభవ పూర్వకంగా తెలుసుకున్నది.

మనం కోరుకున్నది వెంటనే దొరకనప్పుడు బాధ పడకూడదు. దేవుని కాలం ఎప్పుడూ పరిపూర్ణంగా ఉంటుంది. మనం ఓపికతో ఉంటే, మనం ఊహించిన దాని కంటే గొప్పగా ఆయన మనల్ని దీవిస్తారు.

"యెహోవాను బట్టి సంతోషించుము ఆయన నీ హృదయ వాంఛలను తీర్చును" (కీర్తనలు 37:4)

# మదర్ తెరీసా

ఈ ధర్మశాస్త్ర గ్రంథమును నీవు బోధింపక తప్పిపో కూడదు. దానిలో వ్రాయబడిన వాటన్నిటి ప్రకారం చేయుటకు నీవు జాగ్రత్తపడునట్లు దివారాత్రము దాని ధ్యానించిన యెడల నీ మార్గమును వర్ధిల్లజేసికొని చక్కగా ప్రవర్తించెదవు (యెహోషువ 1:8). మదర్ తెరీసా పై వాక్యాన్ని తన హృదయమందు భద్రపరచుకొని ఆ ప్రకారం తన వద్ద చేరిన సిస్టర్స్‌కు బైబిలు వాక్యము బోధించేవారు. నాలుగు సువార్తలలోని యేసుప్రభువు జీవితం, ఆయన బోధలు వారికి వివరించేవారు. ఆధ్యాత్మిక శిక్షణ కొరకు ఫాదర్ హెన్రీ, ఫాదర్ వాన్‌ఎగ్జిమ్ ఎంతో సహాయపడేవారు. మార్చి 1953లో మదర్ తెరీసాతో మొట్టమొదటిగా చేరిన నలుగురు సిస్టర్స్ మిషనరీస్ ఆఫ్ ఛారిటీ సంస్థలో సంపూర్ణ సేవ చేస్తామని వాగ్దానాలు చేయడానికి ప్రత్యేక ప్రార్ధన సమావేశం జరిగింది. ఆనాడు ఆ నలుగురు సిస్టర్స్‌తోపాటు మదర్ తెరీసా కూడా వాగ్దానాలు చేశారు. సువార్త పఠనం, వాక్య పరిచర్య, ఆరాధన జరిగిన తరువాత ఆ అయిదుగురును ప్రమాణం చేయుటకై ఫాదర్‌గారు పిలిచారు. ప్రభువా నీవు నన్ను పిలిచావు అని జవాబిచ్చి ముందు నిలిచారు. అప్పుడు ఫాదర్ నా ప్రియమైన సహోదరీ, నీవు దేవుణ్ణీ, ఆయన సంఘాన్ని ఏమి కోరుకుంటున్నావు అని అడిగాడు. నేను నా ప్రభువును, సంఘానికి, నాకు భర్తయైయున్న క్రీస్తును వెంబడించి నా జీవితకాలమంతా చనిపోయేవరకు ఈ మత సంస్థలో కష్టించి పని చేయుటకు ప్రమాణం చేయుచున్నాను అని చెప్పారు. అంతట ఫాదర్ వారికి ఇలా బోధించారు. మీరు బాప్తిస్మంతో క్రీస్తు వారయ్యారు. మీరు ఎంచుకున్న పని అతి పరిశుద్ధమైనది. కనుక మీరు క్రీస్తుతో ఇంకా గట్టిగా బంధించబడియున్నారు. మీ శరీరము, మనసు, ఆత్మ దేవునికే అర్పితమైనాయి. మీ అయిదుగురు దేవుని సొత్తు కనుక మీరు ఏమి ఆలోచించినా, కోరినా అదంతా ప్రభువు మహిమార్ధమే అని చెప్పాడు. వారి అంగీకారాన్ని అడిగి తెలుసుకున్నాడు. ప్రియ సహోదరీ, నీకు అప్పగింపబడిన నిరంతర దేవుని పనిలో క్రీస్తు ప్రభువుతో గట్టి బంధాన్ని కలిగి ఉండడానికి అంగీకరిస్తున్నావా? దేవుని కృపతో, దేవుని సహాయంతో ప్రభువైన క్రీస్తును అనుసరించుటకు ఆయన చూపిన మార్గాన వెళ్ళుటకు అంగీకరిస్తున్నావా? అని అడిగారు. అంగీకరిస్తున్నానని జవాబిచ్చారు. పరిశుద్ధాత్మ కృపతో నీకివ్వబడిన పేదల సేవ జీవితమంతా చేస్తానని అంగీకరిస్తున్నావా? అంగీకరిస్తున్నాను. ఈ మిషనరీస్ ఆఫ్ ఛారిటీ నియమావళి ప్రకారము, సువార్తలలో ప్రభువు చెప్పిన ప్రకారము నిరంతరం నీ దేవుని సేవిస్తూ, నీ పొరుగు వారిని ప్రేమించి సహాయం చేస్తానని వాగ్దానం చేయుటకు అంగీకరిస్తున్నావా? అంగీకరిస్తున్నాను. అప్పుడు సంఘమంతా నిలువబడి వారికి ఇవ్వబడిన దేవుని పిలుపునకు లోబడి వారు వాగ్దానం చేసిన విధముగా కొనసాగుటకు తగిన విశ్వాసం దయచేయాలని దేవుని ప్రార్ధించారు. మిషనరీస్ ఆఫ్ ఛారిటీ నియమావళిలో పొందుపరచబడిన ప్రమాణాన్ని మదర్ తెరీసా ఈ విధంగా చదివింది. సిస్టర్ మేరీ తెరీసా అనబడు నేను పేదరికం, పరిశుద్ధత, విధేయత మరియు కడుబీదలైన వారికి ఉచితమైన, మనస్ఫూర్తితో చేయవలసిన సేవ చేస్తానని ప్రమాణం చేయుచున్నాను. పరిశుద్ధాత్మ శక్తితో ఈ మన సంస్థ నియమావళికి లోబడి కడుబీదలైన వారికి హృదయ పూర్వకంగా సేవచేస్తానని వాగ్ధానం చేస్తున్నాను. ఇదే విధంగా నలుగురు సిస్టర్స్ కూడా వాగ్ధానము చేశారు.

అప్పుడు ఫాదర్ ఒక్కొక్క సిస్టర్‌తో నాకియ్యబడిన అధికారంతో మీరు చేసిన ప్రమాణాన్ని స్వీకరిస్తున్నారు. ప్రభువు చూపిన సిలువ మార్గంలో మీ సేవ కొనసాగించుటకు దేవుడు సహాయము చేయును గాక. ఆ తరువాత అయిదుగురు సిస్టర్స్ క్రీస్తు బల్లలో పాల్గొనుటకు ముందుకు వచ్చారు. గలతీయులకు వ్రాసిన పత్రిక 2:20 వాక్య ప్రకారము నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడియున్నాను. ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు అనే పరిశుద్ధుడైన పౌలు చెప్పిన మాటల్ని పాటగా పాడుచుండగా అయిదుగురు సిస్టర్స్ ప్రభువు బల్లలో పాలుపొందియున్నారు. ఈ విధంగా మొదటి అయిదుగురు

సిస్టర్లు ప్రమాణ స్వీకారోత్సవ ప్రార్ధన కూటము ముగిసినది. మదర్ తెరీసా దేవునికి కృతజ్ఞతలు చెల్లించెను.

ఆ తరువాత మదర్ తెరీసాకు ఒక హాలును ప్రార్ధనా మందిరముగా ఏర్పాటు చేయబడింది. అందులో బెంచీలు, కుర్చీలు లేవు. అందరూ క్రిందనే మోకరించి ప్రార్ధనలో పాల్గొనేవారు. ఫాదర్ హెన్రీ ప్రతిరోజు ఉదయం ప్రార్ధన నడిపించేవారు. క్రొత్తగా చేరే అమ్మాయిలను యాస్పరెంట్‌గా చేర్చుకొనేవారు. ఆరునెలలు పేదలతో సేవా కార్యక్రమాల్లో పాల్గొనిన తరువాత వారిని పాస్చ్యులెంట్స్‌గా తీసుకొని ఆధ్యాత్మిక శిక్షణగా తరగతులు నిర్వర్తించేవారు. ఒక సంవత్సరం తరువాత వీనిని నోవిసెస్‌గా నియమించి గురు, ఆదివారాల్లో పేదల సేవ చేయించేవారు. మిగిలిన రోజుల్లో కఠినమైన ఆత్మీయ శిక్షణ తర్ఫీదులో ఉంచబడతారు. ఎవరైనా అశ్రద్ధగా, అవిధేయంగా వుంటే సరిచేసి దేవుని వాక్యప్రకారము వారిని ప్రోత్సహించి విధేయులుగా, దేవుని ప్రేమకు పాత్రులగునట్లు మదర్ తెరీసా జాగ్రత్త వహించే వారు. అనేకమంది క్రైస్తవ విశ్వాస వీరుల సేవా కార్య క్రమాల్ని చెప్పి వారిని ఉత్తేజపరిచే వారు. ఫాదర్ హెన్రీగారికి దేవుడిచ్చిన వరము ఈ సిస్టర్స్‌ను తగిన రీతిలో శిక్షణనిచ్చే నైపుణ్యము. రెండవ సంవత్సరము ఈ నోవిసెస్ సిస్టర్స్ కూడా వాగ్దానాలు తీసుకున్న ప్రొఫెస్డ్ సిస్టర్స్‌తో పేదల సేవలో పాల్గొనేవారు. వీరంతా గురువారాల్లో పిక్నిక్‌కు కూడా వెళ్ళేవారు. లేకుంటే మదర్ హౌస్‌ను శుభ్రం చేసి బాగు చేసుకునేవారు. పాటలు నేర్చుకునేవారు.

పరిశుద్ధత పాటించవలసిన కర్తవ్యం ప్రతి ఒక్కరిపైన ఉన్నది. పరిశుద్ధతను దేవుని ద్వారా పొంది ఆచరిస్తూ మనము చేయు క్రియలన్ని దేవుని వైపే ఉండాలని మదర్ తెరీసా అంటారు. మనం ఎక్కడ ఉన్నా, ఏమి చేసినా, మన పొరుగువారికి సేవ చేయుట ద్వారా క్రీస్తు ప్రభువుకు సేవ చేసిన వారమవుతామని తన సిస్టర్స్‌కు బోధించేవారు. డబ్బు ప్రభువు ప్రేమను వ్యాప్తి చేయడానికి ఉపయోగపడాలని, ప్రభువు ఆకలి పట్టెడు మెతుకులు కొరకు కాదుగాని, ప్రేమానురాగాల కోసం ప్రభువు దాహార్తి గొనియున్నాడు. నీ వారితో నీవు నవ్వుతూ వుంటూ, బాధలో వున్న వారితో కొంత సమయం గడిపి, వారికి ఉపశమనం కలిగించే సహాయం చేయాలి. ఇవన్ని చిన్న పనులు కావచ్చుగాని అది దేవుని ప్రేమకు గట్టి పునాదులవుతాయి. మీరు ఎక్కడో మురికి వాడలకు వెళ్ళి అక్కడున్న పేదరికాన్ని రూపుమాపే ప్రయత్నం చేయనవసరం లేదు. నీ కుటుంబంలోనే ఎవరో ఒకరు ప్రేమించబడుట లేదనే భావనతో కుమిలిపోతున్న పేద వారుంటారు. అలాగే నీ పొరుగు వారు కూడా. వారికి మీ ప్రేమను పంచండి. పొరుగు వానిని ప్రేమించమని యేసు ప్రభువు చెప్పాడు. మీ పొరుగింట్లో ఎవరున్నారో మీకు తెలుసా? వారి పేరేమిటో, వారు చేసే పనేమిటో మీకు తెలుసా? మనం ఒకరికోసం ఒకరున్నాం. ఆ సంగతి మర్చిపోవడం వల్లనే ప్రపంచంలో ఇంత అశాంతి. కొత్త వారైతేనేమి, ఎదురు పడినపుడు పలకరింపుగా చిరునవ్వు నైనా అందించలేమా? ప్రతి మనిషిలోను యేసయ్య ఉన్నాడు. యేసయ్య ఎదురుపడితే ముఖావంగా తప్పుకుని వెళ్ళగ లమా? చిరునవ్వు ఒక ప్రేమ కానుక. మీరొచ్చే దారిలో ఎవరూ నిరాదరణకు, అలక్ష్యానికి గురికాకూడదు. అలజడికి లోను కాకూడదు. చుట్టూ ఇంత ప్రపంచం ఉంటే ఏమీ పట్టనట్లు ఎలా ఉంటాం? ఎవరికి ఎవరూ ఏమీ కామన్న భావన అన్నిటికన్నా ప్రాణాంతకమైన అనారోగ్యం. తల్లే తన కడుపులోని బిడ్డను చంపుకోవడం లాంటిది. మనిషిపై మనిషి మమకారం పెంచుకోవాలి. మనిషిలో దేవుడిని అన్వేషించాలి. అసహనంలో, అల్లర్లలో, అస్థిరత్వంలో, ధ్వని కాలుష్యాలలో భగవత్ స్వరూపాన్ని దర్శించలేం. నిశ్శబ్ద ప్రియుడాయన. ప్రకృతిని చూడండి. చెట్లు, పూలు, గడ్డి ఎంత ఘనంగా ఎదుగుతాయో. తలెత్తి నక్షత్రాలను చూడండి, సూర్యచంద్రులను చూడండి. వాటి భ్రమణం ఎంత నిశ్శబ్దంగా ఉంటుందో. ఆత్మలను స్పృశించాలంటే మనసు ప్రశాంతంగా ఉండాలి. మనసు ధ్యానమందిరం కావాలి. ప్రపంచ శాంతి కోసం ప్రతిఒక్కరు బాధ్యత తీసుకోవాలి. మన ఒక్కరి వల్ల ఏమౌతుందని ఆలోచించకపోతే ఆ మేరకు సముద్రం తగ్గుతుంది. ప్రయత్నం ఏదీ వృధా కాదు. చిన్న ప్రయత్నాల్లో నమ్మకం కోల్పోతుంది. మన శక్తి వాటిలోంచే విస్తరిస్తుంది. భూగోళానికి దేవుడు రాసే ప్రేమలేఖలో అక్షరాల మౌదాం రండి. మదర్ తెరీసా ఒక్క వాక్యం చెప్తే వేరేవాళ్ళు అర్ధగంట బోధ చేసినంత సమానం. **(సశేషం)**

# తల్లిదండ్రులారా!

మీ బిడ్డలు దేవునియందలి భయభక్తులతో ఎదగటం వలన వారిలో ఆత్మఫలమైన *ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహములు (గలతీ. 5:22)* ఫలించి, దేవునికి, తల్లి దండ్రులకు, పెద్దలకు ఇష్టులై మంచి పేరు సంపాదించుకుంటారు. ఈ లోకానుసారంగా పెరిగితే, శరీర కార్యములైన *జారత్వము, అపవిత్రత,* కాముకత్వము, *విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆట పాటలు మొదలైన (గలతీ. 5:19-21)* వాటికి లోనై అందరి దృష్టికి అసహ్యులవు తారు. ఇలాంటి చెడ్డ లక్షణాలున్న పిల్లలు లేదా యవ్వనస్తులు మీకు ఎదురైతే, మీరేమనుకుంటారు? 'వీరిని ఇలా పెంచారేంటి?' అని ఖచ్చితంగా వారి తల్లి దండ్రులనే కదా తప్పు పడతారు. మీరు మీ బిడ్డలను దేవునియందలి భయభక్తులతో పెంచకపోతే ప్రతిఒక్కరూ మిమ్మల్నే కదా తప్పు పట్టేది. పిల్లలలో ఆత్మఫలము ఫలించాలంటే వారిని జీవాహారమైన వాక్యముతో పెంచాలి. వాక్యప్రకారం బిడ్డలు పెరిగితే యవ్వనస్తులైనప్పుడు యోసేపువలె పాపమునకు దూరంగా పారిపోతారు. యాకోబు యోసేపును దేవునియందలి భయభక్తులతో పెంచకపోయినట్లయితే *'నేనెట్లు ఇంత ఘోరమైన దుష్కార్యము చేసి దేవునికి విరోధముగా పాపము కట్టుకొందును' (ఆది. 39:9)* అని అనగలిగే వాడా? యోసేపు వేరే దేశములో ఉన్నాడని, ఈ విషయం బయటపడితే తనను చంపేస్తారేమో అని భయపడి పారిపోలేదు. దేవునికి విరోధముగా పాపము చేయడం ఇష్టంలేక పారిపోయాడు. ఈ రోజుల్లో అలాంటి యవ్వనస్తులు మనకు కనిపిస్తారా? అప్పటి రోజులు వేరు, ఇప్పటి రోజులు వేరు కాదు, ఎప్పుడైనా దేవుని భయం ఉన్నవారు పాపము చేయడానికి వెనకాడతారు. యాకోబు యోసేపును దేవునియందలి భయభక్తులతో పెంచినట్లు మీరు కూడా మీ బిడ్డలను పెంచితే వారు కూడా పాపము చేయడానికి వెనకాడతారు. అప్పుడైనా ఇప్పుడైనా దేవుడు ఒక్కడే. మీ బిడ్డలు పెద్దవారైనప్పుడు పాపము చేయకుండా ఉండాలంటే పిల్లలుగా ఉన్నప్పుడే వారి హృదయంలో వాక్యం నాటబడాలి. *"యౌవనస్థులు దేనిచేత తమ నడత శుద్ధిపరచుకొందురు? నీ వాక్యమునుబట్టి దానిని జాగ్రత్తగా చూచుకొనుట చేతనే గదా?" (కీర్తనలు 119:9).* ఈ లోకానుసారంగా జీవించే తల్లిదండ్రులు వారి బిడ్డలను దేవునియందలి భయభక్తులతో పెంచటానికి మనసు రాదు. ఎందుకంటే వారిలో శరీరకార్యములు ఉంటాయి కాబట్టి, బిడ్డలను దేవునియందలి భయభక్తులతో పెంచుదామన్న ఆలోచనే రాదు. వారి హృదయాలు లోకానుసారమైన విషయాలతో నిండి ఉంటాయి. లోకాన్ని నడిపించేది డబ్బే కాబట్టి వారికి **'డబ్బే దేవుడు'**. నిత్యము డబ్బు జపం చేస్తూ డబ్బును పూజిస్తుంటారు. *'విగ్రహారాధనయైన ధనాపేక్ష' (కొలస్స. 3:5)* కలిగి బిడ్డల ఆధ్యాత్మిక స్థితిని గాలికొదిలేస్తారు. అందుకే అలాంటి వారి పిల్లలు పెరిగి పెద్దవారైనప్పుడు శరీర కార్యాలవైపే మొగ్గు చూపిస్తారు. అప్పుడు వారిని చూచి మీరు ఏడవాల్సిందే. కాబట్టి తల్లి దండ్రులారా, మీ బిడ్డల భవిష్యత్తు నాశనమవ్వడానికి కారణమయ్యే ధనాపేక్ష, లోకానుసారమైన జీవనశైలిని మార్చుకొని మీ బిడ్డలను వాక్యానుసారంగా పెంచితే వారిలో ఆత్మఫలము ఫలించి మీకు మేలు జరుగుతుంది. **మీ బిడ్డలు వాక్యానుసారంగా పెరగటం దేవుని చిత్తమైయున్నది.**

మీ బిడ్డలపట్ల మీకు ఎన్నో ప్రణాళికలు ఉంటాయి. తమ కంటే ఉన్నతస్థానంలో బిడ్డలు ఉండాలని తల్లిదండ్రులు కోరుకోవడం సహజం. వారి స్థోమతకు తగ్గట్లు తమ బిడ్డల పట్ల ప్రణాళికలు రచించుకుంటారు. అయితే మీ ప్రణాళిక దేవుని చిత్తానుసారంగా జరగాలంటే, అది దేవునికి అప్పగించాలి. ఒకవేళ మీ బిడ్డలను డాక్టర్‌గానో, ఇంజినీర్‌గానో,

కలెక్టర్‌గానో లేదంటే కనీసం గవర్నమెంట్ ఉద్యోగిగా చేయాలన్నది మీ ప్రణాళిక కావొచ్చు. అందుకోసం మీరు లక్షల రూపాయలు సంపాదించాలి. మీకు అంత స్థోమత లేకపోతే అప్పులు చేయాలి. రేయింబవళ్ళు కష్టపడాలి. లేదంటే మీ ప్రణాళిక నెరవేరదు. అది మీకు చాలా భారంగా అనిపిస్తుంది. చాలాసార్లు అసాధ్యంగా కూడా అనిపిస్తుంది. మీకు అసాధ్యమైనది దేవునికి సాధ్యము కాబట్టి మీ బిడ్డలపట్ల మీకున్న భారాన్ని దేవునికి అప్పగిస్తే, మీ ప్రణాళిక నెరవేరడం సులభమవుతుంది. *"నీ పనుల భారము యెహోవా మీద నుంచుము అప్పుడు నీ ఉద్దేశములు సఫలమగును" (సామెతలు 16:3).* మీ బిడ్డలను చదివించడానికి పది లక్షలు కావొచ్చు, ఇరవై లక్షలు కావొచ్చు, అంత డబ్బు దేవుడు ఎలా ఇస్తాడు అన్న అనుమానంతో దేవుని మీద ఆధారపడటానికి వెనకాడతారు. బైబిల్లో వ్రాయబడిన వాక్యాల ప్రకారం జీవించాలంటే చాలా ధైర్యం, తెగింపు ఉండాలి. దేవుడు ఎప్పుడూ సహాయం చేయడానికి సిద్ధంగానే ఉంటాడు. మనమే దేవున్ని నమ్మలేక మన స్వంత ప్రయత్నాలు చేస్తుంటాము. **"నమ్ముట నీ వలననైతే"** అని యేసుప్రభువు అనుమానం వ్యక్తం చేయడంలో అర్థం మనం దేవున్ని నమ్మలేము అని. ఒకవేళ దేవున్ని హృదయపూర్వకంగా నమ్మగలిగితే మీ జీవితంలో ఆశ్చర్యకార్యాలకు కొదవే ఉండదు. మీ బిడ్డలను దేవునియందలి భయభక్తులతో పెంచడం ప్రారంభిస్తే, మీ బిడ్డలపట్ల దేవుని ప్రణాళికని ఆయన మొదలుపెడతాడు. మీరు చేయాల్సిందల్లా, మీ బిడ్డలపట్ల ఈ లోకానుసారమైన భారము కాక, దేవునియందలి భయభక్తులతో పెంచాలన్న భారము కలిగి ఉండాలి. అప్పుడు దేవుడు మీ భారాన్ని ఆయన తన భుజాలపై వేసుకొని, మీరు ఊహించని విధంగా మీ బిడ్డల జీవితాన్ని తీర్చిదిద్దుతాడు. మీ బిడ్డల విషయమై మీరు దేవునికి అనుక్షణం కృతజ్ఞతలు చెప్పే విధంగా వారి జీవితం ఉంటుంది. బిడ్డలపట్ల మీ ప్రణాళిక వారు పెద్దవారయ్యే వరకు మాత్రమే ఉంటుంది. కానీ దేవుని ప్రణాళిక జీవితాంతం ఉంటుంది. దేవునియందు మీరు విశ్వాసముంచితే, ఆ ఫలితం కుటుంబం మొత్తానికి ఉంటుంది. *"ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము, అప్పుడు నీవును నీ యింటివారును రక్షణ పొందుదురు" (అపొ.కార్య. 16:31)* అని వ్రాయబడిన ప్రకారం బిడ్డలు రక్షింపబడాలంటే ముందుగా మీరు దేవునియందలి విశ్వాసములో ఎదగాలి. మీ బిడ్డల క్షేమము మీరు కోరుకుంటే దేవున్ని ఆశ్రయించండి. దేవుడు నమ్మదగినవాడు 'మీ కోరికను సిద్ధింపజేసి, మీ ఆలోచన యావత్తును సఫలపరచును' (కీర్తనలు 20:4). మీ బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం మీరు రేయింబగళ్ళు కష్టపడి డబ్బు సంపాదించడం కంటే, దివారాత్రము దేవుని దగ్గర మొఱ్ఱపెట్టుకోవడం ఉత్తమం. మీ బిడ్డల జీవితంలో దేవుని ప్రణాళిక నెరవేర్చడానికి దేవునికి అనుమతిచ్చే వరకు దేవుడు ఏమి చేయలేడు. మీరు మీ ఇష్టప్రకారం, మీ ప్రణాళిక ప్రకారం మీ బిడ్డలను పెంచుతారో, దేవుని ప్రణాళిక మీ బిడ్డల జీవితంలో నెరవేరాలని కోరుకుంటారో మీ ఇష్టం. **దేవునికి ఇష్టంగా మీ పిల్లలను పెంచడం దేవుని చిత్తమైయున్నది. (సశేషం)**


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlinetelugubible.net**

# దేవుని కటాక్షము

ప్రియమైన హన్నాకృప ప్రేక్షకులకు నా శుభములు.

దేవుని యొక్క శక్తి పొందుకోవాలంటే ముందుగా ఆయన కటాక్షాన్ని మనం పొందుకోవాలి. అది మన జ్ఞానం చేత కాదు, కేవలం ఆయన కృపచేతనే అవుతుంది. "వారు తమ ఖడ్గముచేత దేశమును స్వాధీనపరచుకొనలేదు వారి బాహువు వారికి జయమియ్యలేదు నీవు వారిని కటాక్షించి తివి గనుక నీ దక్షిణహస్తమే నీ బాహువే నీ ముఖకాంతియే వారికి విజయము కలుగజేసెను" (కీర్తనలు 44:3) ఇశ్రాయే లీయులను దేవుడు కటాక్షించాడు గనుక దేశమును స్వాధీన పర్చుకొన్నారు. మీరెప్పుడైన ఏదైన వాహనాలు పైన చూస్తే 'నా సన్నిధి నీతో కూడా వచ్చును' అని వ్రాసి ఉంటుంది. ఆయన యొక్క సన్నిధి అంటే హెబ్రీ భాషలో 'పనా' అని అంటారు. పనా అంటే అర్థం 'దేవుని ముఖము'. అంటే మనం ఎక్కడికి ప్రయాణం చేసినా వెళ్ళినా అక్కడికి ఆయన ముఖము వస్తుంది అని అర్థము. ఆయన ముఖకాంతి మన మీద ఉంటుంది. మన చిన్నపిల్లలు ఎక్కడైనా ఆడుకుంటునప్పుడు మనం ఏం చేస్తున్నా, ఎవరితోనైనా మాట్లాడుతున్నా. పిల్లలను చూస్తూనే వుంటాము. పిల్లలు ఎటు వెళ్ళినా వారినే గమనిస్తాం. అలాగే నీవు ఎటు వెళ్ళినా ఆయన నిన్ను చూస్తూనే ఉంటాడు, అంటే ఆయన ముఖము నీ మీద ప్రకాశించిందని అర్థం. ఆయన మనలను తన కళ్ళలో పెట్టుకున్నాడు. మీరు అనుకుంటున్నారేమో ఎవరూ నన్ను పట్టించుకోవట్లేదని. కానీ యెషయా 30:18లో "కావున మీయందు దయచూపవలెనని యెహోవా ఆలస్యము చేయు చున్నాడు మిమ్మును కరుణింపవలెనని ఆయన నిలువబడి యున్నాడు యెహోవా న్యాయము తీర్చు దేవుడు ఆయన నిమిత్తము కనిపెట్టుకొనువారందరు ధన్యులు" ఒకవేళ నిన్ను కరుణించడానికి ఎవరూ నిలబడి లేరేమో. నీకు ఒక గొప్ప శుభవార్త 'ఈ సృష్టిలో సమస్తమును సృష్టించిన ఆయన, భూమ్యాకాశములకు ప్రభువైన ఆయన నీ కొరకు నిలువబడియున్నాడు. ఈ దినమే నీ మీద కటాక్షము చూపించడానికి ఆయన నిలువబడియున్నాడు. దేవుడు నీ పక్షమున కార్యము జరిగించాలంటే నీవు మొఱ్ఱపెట్టాలి. "సీయోనులో యెరూషలేములోనే యొక జనము కాపుర ముండును. జనమా, నీవిక నేమాత్రము కన్నీళ్లు విడువవు ఆయన నీ మొఱ్ఱ విని నిశ్చయముగా నిన్ను కరు ణించును ఆయన నీ మాట వినగానే నీకు ఉత్తరమిచ్చును" (యెషయా 30:19) మొఱ్ఱ అంటే ప్రార్థన మాత్రమే కాదు, ప్రార్థనకు మించి మాటలతో పలుకలేని ఒక ఆవేదన. దేవుడు ఇశ్రాయేలీముల మూల్గును విని అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులతో చేసిన తన నిబంధనను జ్ఞాపకం చేసికొనెను. ఆచారముతో కూడిన ప్రార్థన, అలవాటుతో కూడిన ప్రార్థన ఇది కాదు వీరు చేసింది. నీ జీవితంలో కటాక్షం చూడలంటే ఇటువంటి ప్రార్థనలు కాదు, నీ మాటలకు మించిన ప్రార్థన మొఱ్ఱ రావాలి. అప్పుడు ఆయన కటాక్షంతో కూడిన నిబంధనను జ్ఞాపకం చేసుకుంటాడు. ఇశ్రాయేలీయుల మొఱ్ఱ వినగానే ఆయన ముఖము (సన్నిధి) ఒక్కసారిగా ఐగుప్తులో శ్రమలలో, బానిసత్వంలో ఉన్న ప్రజలవైపు తిరిగింది. ఈ రోజున పరలోకం నుండి ఆయన నీ మూల్గును విన్నాడు. నీ నిద్రలేని రాత్రులు ఆయన చూసియున్నాడు. నీ కన్నీరుని ఆయన చూశాడు, ఎవరికీ చెప్పకోలేని సమస్యలు, ఇబ్బం దులు. నువ్వు ఒక్కదానివి, నువ్వు ఒక్కడవే ఏడుస్తున్న ఆ నిట్టూర్పులు ఆయన చూస్తున్నాడు. ఈ రోజు నేను మీతో చెప్తున్నాను. యెహోవా కటాక్షము నీ మీద ఉంది అంటే యెహోవా బాహువు నీతో పాటు వుంది. యెహోవా యొక్క ముఖకాంతి దక్షిణహస్తము నీతో పాటు ఉంది. ఇశ్రాయేలీ యుల మూల్గును విని ఆయన దిగి వచ్చాడు. నేను నిర్ధారించి చెప్పగలను నీవు నిజంగా హృదయపూర్వకంగా మొఱ్ఱపెట్టిన యెడల నీ మొఱ్ఱ విని ఆయన నిన్ను కటాక్షింపడా? దేవుడు పక్షపాతి కాదు. కానీ దేవునికి ఇష్టులైన వారు వున్నారు. వారు ఎవరు అంటే మూల్గిన వాళ్ళు, ఏడ్చినవాళ్ళు, అడిగిన వాళ్ళు, బతిమాలినవారు. యెబ్బేకు రేవు దగ్గర యాకోబువలె దేవుని పాదములను పట్టుకుని అడిగినవారు. మీరు మరియు నేను అటువంటి వ్యక్తులుగా అవుదము గాక! దేవుని కటాక్షమును పొందుదము గాక. ఆమేన్.

–ఇట్లు, **డా॥ సుష్మ ప్రశాంత్, నెల్లూరు**

# నా కుటుంబము

**భార్య, భర్త, పిల్లలు కలిసి ఒకే చోట ఉంటే దానిని కుటుంబము అంటారు. పిల్లలు ఉన్నా లేకపోయినా భార్యా భర్తలు కలిసి జీవిస్తున్నా కుటుంబమనే అంటారు. కుటుంబ వ్యవస్థ అనేది దేవుని ప్రణాళికలో భాగమే. కుటుంబ వ్యవస్థలో స్త్రీ ప్రధాన భూమిక పోషిస్తుంది.**

---

మరియొక పట్టణంలో ఒక దైవజనునికి తొమ్మిదిమంది సంతానం. ఆయన వెళ్ళిపోయాడు. ఆయన వెళ్ళిపోకముందే వారి పెద్ద కుమారుడు అన్నదమ్ములు, అక్క చెల్లెండ్రందరు పెళ్ళిళ్ళు అయిపోయి పలు పట్టణాలలో జీవిస్తున్నారు. వారందరూ ప్రతి సంవత్సరం ఒకరోజు నిర్ణయించుకొని కుటుంబ సభ్యులందరు కలుసుకోవాలని సూచించారు. ఏ తారీఖున తల్లిదండ్రులు ఒకటై కుటుంబాన్ని ఏర్పాటు చేసిన తారీఖున. ఇప్పుడు ఆ కుటుంబ యజమానులు ఇద్దరూ లేక పోయినా, వారు కుటుంబం ఏర్పాటు చేసి తొమ్మిదిమంది బిడ్డలను ప్రభువులో పెంచి ఈ లోకాన్ని వదలి వెళ్ళిపోయినా, వారు ఏర్పాటు చేసిన కుటుంబం ఈ లోకంలోనే నిలచి యున్నది. ఎంత గొప్ప ధన్యత! మన కుటుంబం ఆలాగున జీవించాలని ప్రభువు కోరిక. ఆయన అసాధ్యాలను మన జీవితంలో సాధ్యం చేసే దేవుడు. అయితే మనం కుటుంబ సమేతంగా ఆయనలో నిలచియుండాలని కోరుతున్నాడు.

అబ్రాహాము దీవించబడటానికి కారణము ఆయన కుటుంబము. 'ఎట్లనగా యెహోవా అబ్రాహామును గూర్చి చెప్పినది. అతనికి కలుగుజేయునట్లు తన తరువాత తన పిల్లలును తన యింటివారును (కుటుంబమును) నీతి న్యాయములు జరిగించుచు, యెహోవా మార్గమును గైకొను టకు అతడు వారికాజ్ఞాపించునట్లు నేనతని నెరిగియున్నా ననెను' (ఆది. 18:19).

అయితే నా చిత్తానుసారుడని దేవునిచే చెప్పబడిన ప్రవక్త యైన దావీదు రాజు యొక్క సంగతి నీవు యెహోవా మాటను తృణీకరించి ఆయన దృష్టికి చెడుతనము చేసితివేమి నీ యింటి వారికి (కుటుంబమునకు) సదాకాలము యుద్ధము కలుగును. ఆయన కుటుంబ జీవితం భయంకరమైనది.

కాబట్టి మనం మన కుటుంబాలను ప్రేమిస్తే దేవుని ధర్మశాస్త్రమును నిరంతరము ధ్యానించవలసిందే!

పద్దనరాములో తన మామ దగ్గర బానిసత్వంలోవున్న యాకోబును దేవుడు లేచి, బేతేలుకు వెళ్ళమంటే వెళ్ళాడు. మొదట తనను తరుముకొని వస్తున్న మామ అతని బంధు వుల నుండి దేవుడే అడ్డుగా వచ్చి, అతని మామతో నీవు యాకోబుతో మంచికాని, చెడుకాని, పలుకకుము. జాగ్రత్త సుమీ! అన్నాడు. తన అన్న నాలుగువందలమందితో ఎదుర్కొంటే దేవుడు కాపాడాడు. కష్టాలన్ని పోయిన తరువాత బేతేలు పోకుండా తన కుటుంబాన్ని షెకెము దగ్గరకు నడిపించాడు యాకోబు.

యాకోబు కుమార్తె దీనా ఆమె ఎదిగిన తరువాత షెకెము దేశపు కుమార్తెలను చూడవెళ్ళెను అనగా మొదటిసారిగా చూడవెళ్ళిందా? లేక అలవాటుగా చూడవెళ్ళిందా? ఆమె ఆ పట్టణంలో పెరుగుతున్నది. ఆ దేశపు కుమార్తెలను చూడ వెళ్ళింది. రిబ్కా అనిన మాటలు యాకోబుకు గుర్తులేవా! హేతు కుమార్తెల వలన ప్రాణము విసికినది. ఈ దేశస్తు రాండ్రయిన హేతు కుమార్తెలలో ఒక దానిని యాకోబు పెండ్లి చేసుకొనిన యెడల నా బ్రతుకువలన నాకేమి ప్రయోజనము.


రాహేలు, లేయా, యాకోబులు తమ కుమార్తెయొక్క అందము, రూపం చూసి సంతోషించి యుండవచ్చు. ఈనాటి క్రైస్తవులు తమ పిల్లలు టి.వి. ఎదురుగా కూర్చొని క్యాసెట్ల ద్వారా, సిడిల ద్వారా, ఇంటర్నెట్ ద్వారా తమ కుమార్తెలు ఈ దేశపు కుమార్తెలను చూడవెళ్తుంటే తల్లి దండ్రులు ఎంతో సంతోషిస్తున్నారు.

**(సశేషం)**

## ఈ నెల ప్రశ్న - మే-2026

**గొల్యాతు సహోదరుని పేరు ఏమిటి?**

**(1దినవృత్తాంతములు)**




మీ జవాబు (రెఫరెన్సుతో సహా) ఈ నెల 15వ తేదీలోపు 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా మాత్రమే పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో **'లక్కీడిప్'** ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ. 250/-లు విలువ చేసే **'అపొస్తలుడు'** అనే పుస్తకం బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం కేవలం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు (చందాదారుల పట్టికలో పేరు ఉన్నవారు) ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 15వ తేది లోపు చందా చెల్లించేవారు కూడా పాల్గొనవచ్చును. ఈ క్రింది బాక్సులో జవాబు, మీ పేరు, బుక్ సీరియల్ నంబరు వేసి ఫోటో తీసి వాట్సాప్ ద్వారా పంపించాలి. పేరు, సీరియల్ నంబరు లేకపోతే వారి పేరు లక్కీడిప్‌లో చేర్చబడదు.

జవాబు.........................................................

పేరు.............................................................

గ్రామము................బుక్ సీరియల్ నంబరు...........

**ఏప్రిల్-2026 ప్రశ్న జవాబు :**

**అబీ (2రాజులు 18:2)**

(జవాబు మరియు రెఫరెన్సు తప్పని సరిగా వ్రాయాలి)

**జవాబులు పంపినవారు :**

1. టి. క్రిస్టియానమ్మ- నందికొట్కూరు
2. వై.సంధ్యారాణి-ఒంగోలు
3. బి. నెహెమ్యా-చిన్నగంజాం
4. స్వయంప్రభ-చిలకలూరిపేట

### చందాదారుల వివరములు

| | | |
|---|---|---|
| **పి.వి.కెరోలిన్, గుంటూరు** | **(12-12-25)** | **10000** |
| ఈ.సి.సుగుణమ్మ, పులివెందుల | (26-12-25) | 5000 |
| యు. అనిత, సిరివెళ్ళ | (09-12-25) | 5000 |
| డా॥ బి. ప్రజ్వలిత్ రూబేన్, హన్మకొండ | (12-10-24) | 5000 |
| రెవ.డా॥ వి. విజయకుమార్, బొబ్బిలి | (15-01-24) | 5000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (21-06-24) | 5000 |
| మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా | (29-11-22) | 5000 |
| డా॥ క్రిస్టియన్ సిరప్ప, అనంతపూర్ | (23-01-26) | 3000 |
| బి. ప్రభువరకుమార్, రామన్నపేట | (24-06-25) | 3000 |
| కె. రజిని, నరసరావుపేట | (15-06-25) | 3000 |
| బి. రవికుమార్, హైదరాబాద్ | (26-11-25) | 2000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (22-08-25) | 2000 |
| పి. జయదేవి, గుంటూరు | (03-07-25) | 2000 |
| వై. సంధ్యారాణి, ఒంగోలు | (04-01-25) | 2000 |
| డా॥ సిహెచ్‌కె. సుష్మప్రశాంత్, నెల్లూరు | (22-01-24) | 1500 |
| శ్రీమతి రూతు హోసన్న, కావలి | (19-04-26) | 1000 |
| కొడవటికంటి అశోక్‌కుమార్, ఒంగోలు | (09-08-25) | 1000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (27-03-25) | 1000 |
| జి. కమలాకర్, ఒంగోలు | (03-03-25) | 1000 |
| జి.మాణిక్యమ్మ, అనంతపురం | (25-03-24) | 1000 |
| డి. ప్రభావతి, కొడవకల్లు, కృష్ణాజిల్లా | (12-12-25) | 800 |
| టి. కళావతిజాకబ్, ఒంగోలు | (14-04-26) | 500 |
| టి. ప్రేమ్‌చంద్రరావు, ఒంగోలు | (14-04-26) | 500 |
| యస్. గోపి, సుడిగాం, విజయనగరం | (11-04-26) | 500 |
| బి. జయరావు, నెల్లూరు | (10-04-26) | 500 |
| జి. జార్జిథామస్, దుగ్గిరాల | (07-04-26) | 500 |
| బి. నెహెమ్యా, చిన్నగంజాం | (07-01-26) | 500 |
| పి. దేవదానం, గుంటూరు | (17-10-25) | 500 |
| యం. విల్సన్ సామ్యేల్, నెల్లూరు | (08-09-25) | 500 |
| డి. శ్యామ్‌సిన్హా, బాపట్ల | (04-09-25) | 500 |
| ఆర్. జయమ్మలాబాను, గుంతకల్లు | (16-07-25) | 500 |
| కె. ప్రకాశరావు, నరసరావుపేట | (14-01-25) | 500 |
| బి. సరోజిని, గుంతకల్లు | (06-05-25) | 400 |
| టి. జోయల్‌రాజు, భీమిలి | (11-03-26) | 350 |
| కె. స్వప్నిక, మార్కాపురం | (20-02-26) | 350 |
| జి. హనోక్, తూర్పుగంగవరం | (12-02-26) | 350 |
| జి. మేరిక్యాథరిన్, ఒంగోలు | (11-02-26) | 350 |
| డి. శామ్యూల్ డేవిడ్, దేవరపల్లి | (04-02-26) | 350 |
| డి. నాగేశ్వరరావు, సంతరావూరు | (31-01-26) | 350 |
| కె. ప్రభాకర్, వెంకటగిరి | (06-01-26) | 350 |
| సిహెచ్. దయరాజు, రామానుజపురం | (05-11-25) | 350 |
| కె. మార్టిన్‌మధుచరణ్, పులివెందుల | (18-10-25) | 350 |
| టి. క్రిస్టియానమ్మ, నందికొట్కూరు | (08-09-25) | 350 |
| పి. స్వప్న, పాల్వంచ | (09-08-25) | 350 |
| మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ | (06-08-25) | 350 |
| జి. ఏంజల్ పౌలాస్- ఒంగోలు | (02-08-25) | 350 |
| జి. రవి, వేల్పూరు | (12-07-25) | 350 |
| స్వయంప్రభ, చిలకలూరిపేట | (14-06-25) | 350 |
| యస్. రాజశేఖర్, కర్నూలు | (04-06-25) | 350 |

**చిన్నపిల్లల పేజి**

# దేవుని సమయం

లిఖిత తన తెలివితేటలతో స్కాలర్‌షిప్ సాధించి సిటిలోనే మంచి స్కూల్‌లో అడ్మిషన్ పొందుకుంది అనే వార్త అందడంతో బంధువులందరూ ఫోన్స్ చేసి శుభాకాంక్షలు చెప్తున్నారు. లేకుంటే ఆ స్కూల్ ఫీజులు భరించడం లిఖిత తల్లిదండ్రులకు కల అనే చెప్పాలి.

లిఖిత తండ్రి డేవిడ్ ఒక ప్రైవేట్ ఉద్యోగి. దైవభక్తి కలిగిన వ్యక్తి కావడంతో నిజాయితీగా పని చేయడమే అతనికి తెలుసు. ఆఫీసులోనే కాక ఇంట్లోను, సంఘంలోను మంచి సాక్ష్యము కలిగిన వ్యక్తి. భర్తకు తగిన భార్య మేరి.

లిఖితకు క్రొత్త స్కూల్ బాగా నచ్చింది. చాలా అడ్వాన్స్‌డ్ టీచింగ్ ఎయిడ్స్ అంటే డిజిటల్ క్లాస్‌రూమ్స్, ఇన్నోవేటివ్ సైన్స్ ల్యాబ్ అవర్స్, అప్‌డేటెడ్ ఆన్‌లైన్ టెక్నికల్ సపోర్ట్ ఇలా ఎన్నో క్రొత్త క్రొత్త సౌకర్యాలు ఉండడంతో లిఖిత ఆనందానికి హద్దులు లేవు. కూతురి సంతోషం చూసి మురిసిపోయారు తల్లిదండ్రులు.

కొన్ని రోజులు గడిచాయి. ఒక సాయంత్రం వేళ లిఖిత తండ్రితో డాడీ మనం కారు ఎప్పుడు కొంటాము అడిగింది. ఊహించని ప్రశ్న అయినప్పటికి డేవిడ్ ఎటువంటి తడబాటు లేక దేవుడు అనుమతించినప్పుడు అన్నాడు చిరునవ్వు నవ్వుతూ తన పని తన చేసుకుంటూనే. అదే ఎప్పుడు? అంది లిఖిత కాస్త స్వరం పెంచి అసహనంగా. లిఖిత ప్రశ్న కంటే లిఖిత మాట తీరు డేవిడ్‌ను ఆశ్చర్యపరిచింది. తన పని ఆపి తలపైకెత్తి చూసిన తండ్రి చూపులోని ప్రశ్న అర్థమైన లిఖిత సమాధానంగా డాడీ స్కూల్‌లో నా ఫ్రెండ్స్ అందరూ కార్లలో వస్తారు. నేను మాత్రమే టూ వీలర్. అది సైకిల్. కనీసం బైక్ కూడా కాదు అంది తన మనసులోని భావాన్ని ముఖం మీద స్పష్టంగా ప్రదర్శిస్తూ.

ఆ రోజు రాత్రి పడుకోబోయేముందు లిఖిత తనకు బైకు కావలని, ఎలాగైనా తండ్రిని ఒప్పించమని తల్లి సిఫారసు కోరింది. ఫలితంగా మరునాడు ప్రొద్దున్నే స్కూల్‌కు సిద్దమౌతున్న లిఖితను పలకరిస్తూ ఈ నెలలో నాకు ప్రమోషన్ వస్తుంది. కాబట్టి నీకు స్కూటి కొనిస్తాను కాకపోతే ఎలక్ట్రిక్ బైక్ బేసిక్ మోడల్ అన్నాడు డేవిడ్. సరే డాడీ, నా ఫ్రెండ్ రీమా కూడా ఎలక్ట్రిక్ బైక్ తీసుకుంటానంటుంది అన్నది లిఖిత సంతోషంగా. తండ్రి నుండి స్కూటీకి అప్రూవల్ దొరకడంతో లిఖిత ఆనందానికి హద్దులు లేవు. కానీ డేవిడ్‌కు ప్రమోషన్ రాకపోవడంతో లిఖిత స్కూటీ కూడా ఇంటికి రాలేదు.

అలా దాదాపు ఆరు నెలలు గడిచాయి. బైక్ కొనివ్వలేదని తండ్రి మీద కోపంగా ఉంది లిఖితకు. దానికి తోడు ఈ సారి కంబైన్డ్ స్టడీస్‌కి లిఖిత వాళ్ళింటికి వెళ్దామనే తన స్నేహితురాళ్ళ అభిప్రాయాన్ని ఏదో కారణం చెప్పి సున్నితంగా తిరస్కరించిన లిఖితకు లోలోపల తండ్రి మీద కోపం ఎక్కువ అవ్వసాగింది. సరైన ఇల్లు లేదు, వెహికల్ లేదు.. ఛ... ఏదైనా అంటే సరైన సమయానికి దేవుడిస్తాడు అంటాడు.. అలా అయితే ఎంతో నిజాయితీగా పని చేసే డాడీకి ప్రమోషన్ ఎందుకు రాలేదో... కాదు కాదు.. దేవుడు ఎందుకు ఇవ్వలేదో అనుకుంది మనసులో కోపాన్ని మనసులోనే అణుచుకుంటూ.

కోపాన్ని ఎంత అణచుకున్న అప్పుడప్పుడు మాటలు నియంత్రణ తప్పి బయటకు దొర్లేవి. అది గమనించిన తండ్రి లిఖితతో దేవుని సమయం కొరకు ఎదురు చూడటం అనేది అన్నిటికంటే ఉత్తమం అని చాలా మృదువుగా చెప్పాడు. తండ్రి మాటలు లిఖిత కోపాన్ని చల్లార్చలేదు కానీ అతను చెప్పిన తీరు మాత్రం లిఖిత కోపాన్ని ఆ సమయానికి దూరం చేశాయి అనవచ్చు.

మరునాడు స్కూల్లో తన ఫ్రెండ్ రీమాకి యాక్సిడెంట్ అయిందని తెలుసుకొని పరామర్శించడానికి వాళ్ళ ఇంటికి వెళ్ళింది లిఖిత. మూడు నెలలు క్రితం కొన్న ఎలక్ట్రిక్ బైక్

**(మిగతాది 14వ పేజిలో)**

## బైబిల్ పద వినోదము-16 జవాబులు

### యూదా రాజులు

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| యె | నా | త | ల్లి | అ | హ | జ్యా | గ | బ | ర్భ | లు | యీ | గ | బీ | అ |
| హో | చి | ర్మిం | యా | యో | నా | తా | ను | ని | త్షె | న్ను | న | దు | మం | సొ |
| షా | న | ము | రి | సి | ద్కి | యా | వా | డ | వు | బ | ను | అ | లు | నీ |
| పా | న | యా | ఊ | అ | వు | యె | హో | యా | కీ | ను | తా | బ్షా | నీ | వే |
| తు | న్ను | బీ | క | యా | జ | లు | గ | సె | జే | సి | నా | లో | లు | యా |
| చూ | ఇ | అ | ము | జ్జి | సొ | ర్యా | దా | ధ | రూ | వి | న | ము | బా | జ్కి |
| ఆ | ష్బో | ద | కీ | ఉ | లొ | గా | వీ | భ | య | యా | అ | ము | నా | హి |
| మో | షె | ను | ము | షు | మో | ర్య | దు | శ్చ | ఆ | ను | మ | బు | వా | యో |
| ను | తు | ష్నే | యె | నా | ను | ఓ | బే | దె | దో | ము | జ్యా | కు | పు | ట్టు |
| ట్టి | బ | న | హో | యా | ను | ఆ | హ | జు | దు | అం | ము | వి | న్న | చ |
| షు | నే | మ | యా | షీ | ను | ష | అ | నీ | యి | కు | రె | తా | కృ | జు |
| తు | వా | స్తు | కీ | యె | తా | మ్మా | బీ | జ్ఞ | ష్న | లు | హ | త | యో | హో |
| తా | లు | యో | ము | చె | ద్యా | ల్లిం | షై | చ | యె | కా | బా | చ | న్నా | యా |
| మా | ర్య | శ్చ | ఆ | దీ | లు | ము | ర్య | కా | నీ | మీ | ము | సా | ను | హో |
| రు | క | ర | య | ము | లు | యె | హో | రా | ము | గొ | ల్యా | తు | ఆ | యె |

**జవాబులు పంపినవారు :**

1. యం. స్వయంప్రభ-చిలకలూరిపేట, 2. బి. నెహెమ్యా-చిన్నగంజాం, 3. సి.హెచ్.దయరాజు-రామానుజపురం, 4. వి.వినోద్‌కుమార్-మండపం, 5. రంజిత్‌సింగ్‌రామానుజులు-ఒంగోలు, 6. వై. సంధ్యారాణి-ఒంగోలు, 7. కె. జయమ్మ-చీరాల, 8. యస్. నీలవేణి-అనపర్తి, 9. బి. మోనిక ఏంజెలినా-ఒంగోలు, 10. టి. క్రిస్టియానమ్మ-నందికొట్కూరు, 11. పి.విజయకుమారి-ఒంగోలు, 12. బి. కేథరిన్ డెస్మండ్-ఒంగోలు


**సండేస్కూల్/V.B.S. బుక్స్**

**మరియు గేమ్స్ కొరకు**

**ఫోన్: 9440217726**



# బైబిల్ పద వినోదం - 17

## ఎజ్రా, నెహెమ్యా, ఎస్తేరు, యోబు

ఈ క్రింది పదాలను ప్రక్కనున్న అక్షరాలలో వెదకండి. పదాలు అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా ఉండవచ్చు, కానీ పదాలు ఒకదాని మీదగా ఇంకొకటి గుర్తించ కూడదు. గుర్తించిన క్రింది పదమును (✓) టిక్ పెట్టండి. మిగిలిన అక్షరాలను ఎడమ నుండి కుడికి, కుడి నుండి ఎడమకు సమకూర్చి వచ్చిన వాక్యమును క్రింద బాక్స్‌లో వ్రాయండి.

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| అ | క్రై | నీ | ది | వా | ప | అ | వే | మి | స్పా | జె | రె | షు | అ | స |
| బీ | ర్దె | న | బు | వై | వి | మో | చ | కు | డు | ద | యు | తీ | ద్వి | ర్వ |
| హా | మొ | యో | యె | హో | వా | నీ | హ | క | ల్యా | వే | ఆ | ము | ఊ | శ |
| యి | మ | ను | ము | లు | బె | బ్బా | రు | జె | ను | శ | య | జు | కా | క్తు |
| లు | యా | జీ | కె | అ | హా | దే | కా | ష | శ | హా | ఎ | ము | ల | డు |
| భూ | ను | దు | ము | హ | కో | వ | షూ | న్య | స | సై | టి | లీ | వా | ను |
| మి | ల్ల | ని | వ | ష్వే | రె | దూ | దా | ఎ | ని | యో | జా | దా | హు | లో |
| బి | న | ష్తి | డు | రో | షు | త | ఉం | లీ | హ | లు | యే | ల్తీ | య | ష |
| ది | అం | త | టి | షు | నీ | లు | ని | ఫ | స | ద | ము | యే | షూ | వ |
| టి | షే | ష్బ | జ్జ | రు | సా | వా | మ్యా | జు | ను | ల | స్సా | న్యా | ము | ద్ర |
| స్త | లో | ఉం | య | ము | ను | హె | రు | డు | యె | న | ది | న | అం | ము |
| ష | శె | చి | థా | రీ | నె | స్తే | జిం | సృ | ని | మీ | టి | హ | త | య |
| హ | రా | కు | ర్థ | పూ | ఎ | వా | జో | ఫ | రు | టి | మా | న | న్ని | లో |
| ర్త | యా | రు | త | వా | డు | పా | ను | మా | హా | కా | ని | టి | ఎ | సి |
| అ | డ | బా | భ | య | భ | క్తు | లు | వు | కు | ప్పు | హ | రెం | కె | జ్రా |

పేరు........................గ్రామము........................

అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు........................

**'బైబిలు పద వినోదము-17'** పూర్తి చేసిన తర్వాత పేరు, ఊరు, అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు వ్రాసి ఈ పేజీని ఫోటో తీసి 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా పంపగలరు లేదా ఈ పేజీని జెరాక్స్ తీసి **15వ తేదీలోగా** మా అడ్రసుకు పంపగలరు. సీరియల్ నంబరు వేయకపోతే వారి పేరు ప్రచురింపబడదు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఎజ్రా | వష్తి | ఊజు | యోబు | కోరెషు | యేషూవ |
| మొర్దెకై | నెహెమ్యా | యోజాదా | శెరాయా | హకల్యా | మిస్పా |
| నీసాను | బారుకు | హదస్సా | ఎస్తేరు | హామాను | జెరెషు |
| షూషను | పూరీము | హనన్యా | బిల్దదు | యెమీమా | జోఫరు |
| కెజీయా | ఎలీహు | షేష్బజ్జరు | యథార్థత | సహాయము | అపవాది |
| ఎలీఫజు | సిలోయము | జెరుబ్బాబెలు | భయభక్తులు | అహష్వేరోషు | షయల్తీయేలు |
| అర్తహషస్త | విమోచకుడు | అబీహాయిలు | కెరెంహప్పుకు | దేవదూతలు | సర్వశక్తుడు |

**పై పదాలను గుర్తించిన తర్వాత మిగిలిన అక్షరాలను సమకూర్చి, వచ్చిన వాక్యమును ఇక్కడ వ్రాయండి.**

_ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _

(నెహెమ్యా 9:6)

_ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _